

ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 31-01-2025 | సంపుటి - 21 | సంచిక -283 | రూ : 4 | పేజీలు: 8





## హెచ్1బీ వీసాలు

# 75,000లోపే ఉండాలి

- సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్ సూచన

వాషింగ్టన్: భారత్ నుంచి అమెరికాకు విద్యార్థులుగా, ఎక్స్ఛేంజి విజిటర్స్‌గా వచ్చి 2023లో వీసా గడువు తీరినా వెనక్కి తిరిగి వెళ్లని భారతీయులు 7,000 మంది ఉన్నారని సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్ (సీఐఎస్) వెల్లడించింది. వీరితోపాటు దాదాపు 32 దేశాల విద్యార్థులు, ఎక్స్ఛేంజి విజిటర్స్‌లో 20శాతానికిపైగా గడువు తీరినా అమెరికాను వదిలి వెళ్లడం లేదని పేర్కొంది. ఎఫ్, ఎం కేటగిరీల్లో ఈ సమస్య అధికంగా ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో వలస చట్టాల్లో, హెచ్ 1బీ వీసా విధానాల్లో సంస్కరణలు అవసరమని అమెరికా చట్టసభ కమిటీ సభ్యులకు సూచించింది. హెచ్ 1బీ వీసాలు 75,000లోపే ఉండాలని సిఫార్సు చేసింది. 'అమెరికాలో ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పునరుద్ధరణ'పై సీఐఎస్ ప్రతినిధి జెస్సికా ఎం వాన్.. సభా కమిటీకి వివరాలను వెల్లడించారు. అమెరికాలోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలో చదువుకోవడానికి, భాషా శిక్షణకు ఎఫ్1 వీసాలిస్తారు. వృత్తి విద్యలో శిక్షణకు, విద్యేతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, భాషేతర అంశాల్లో శిక్షణ పొందేందుకు ఎం1 వీసాలను అందజేస్తారు. 'భారత్, చైనా, బ్రెజిల్, కొలంబియాల నుంచి వచ్చిన వారిలో ఒక్కో దేశం నుంచి 2,000 మందికిపైగా 2023లో వీసా గడువు తీరినా అమెరికాలోనే ఉంటున్నారు. ఇందులో భారత్ నుంచి వచ్చిన వారే అత్యధికంగా 7,000 మంది ఉన్నారు. అందుకే వీసా జారీ విధానాల్లో సవరణలు అవసరం. విద్యార్థి వీసాలను జారీ చేసే విషయంలో ద్విలక్ష్య విధానాన్ని రద్దు చేయాలి తరువాయి 2లో

## నేడు ఉస్మానియా ఆసుపత్రికి

# సీఎం భూమిపూజ

- అత్యాధునిక వైద్య సౌకర్యాలతో నిర్మాణం

హైదరాబాద్: ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్‌నిర్మించ తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నూతన ఆసుపత్రి నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఉదయం 11.55 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ముఖ్య అధికారులు హాజరు కానున్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. ప్రస్తుతం ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతన భవనాన్ని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న భవనం కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని నిర్ణయించారు. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, తరువాయి 2లో



# యాదగిరిగుట్టలో మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు

- ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు నిర్వహణ



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ స్వర్ణ విమానం ఆవిష్కరణకు ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు 5 రోజుల పాటు మహా కుంభాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో.. ఏర్పాట్లపై యాదగిరిగుట్టలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఎన్.శ్రీధర్, యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పుణ్య నదుల నుంచి జలాల సేకరణకు తరువాయి 2లో

## కుంభమేళాకు అధికారుల తాకిడి

### మా హెచ్చరికలు పట్టించుకోలేదు: కాంగ్రెస్

ప్రయాగ్‌రాజ్ (యూపీ), ముంబయి, ఢిల్లీ: ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు గురువారం యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్, డీజీపీ ప్రశాంత్‌కుమార్ కుంభమేళాను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాట ఘటనపై తరువాయి 2లో



# 95523 00009తో 161 సేవలు

- రాష్ట్రంలో ఇక వాట్సప్ పాలన
- ప్రజల చేతుల్లో 'మన మిత్ర'
- సులభంగా ధ్రువపత్రాలు, ఆర్టీసీ, దేవాలయాల టికెట్లు
- సేవలను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్



2లో



## అమెరికా విమాన ప్రమాదం..

# ప్రెస్‌మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేసిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్ సమీపంలో ప్రయాణికుల విమానం, హెలికాప్టర్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 64 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై అధ్యక్షుడు ట్రంప్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత అధ్యక్షులు బరాక్ ఒబామా, జో బైడెన్ పాలసీ విధానాలను తప్పుబట్టారు. వారు ఆకాశ భద్రతా ప్రమాణాలకు సంబంధించి రాజీపడ్డట్లు పేర్కొన్నారు. తాను మాత్రం భద్రతకే తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఒబామా, బైడెన్, ఇతర డెమొక్రాట్లు తమ విధానాలకే మొదటి ప్రాధాన్యమిచ్చారని విమర్శించారు. వారు కొందరికే ప్రాధాన్యత ఇచ్చారని, మేము సమర్థులైన వారినే కావాలనుకుంటున్నట్లు తెలిపారు. సుపీరియర్ ఇంటెలిజెన్స్ అవసరమయ్యే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో అనర్హులను నియమించినట్లు ట్రంప్ విమర్శించారు. గతవారం తాను సంతకం చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ ప్రమాణాల పునరుద్ధరణ సైతం ఉన్నట్లు తెలిపారు. ప్రెస్ మీట్‌లో మాట్లాడడానికి ముందు బాధితులకు సంతాపంగా ట్రంప్ కాసేపు తరువాయి 2లో

# రాష్ట్రంలో రూ.44,778 కోట్ల పెట్టుబడులు

- 19,580 మందికి ఉపాధి
- పునరుత్పాదక విద్యుత్, ఆహార శుద్ధి ప్రాజెక్టులకు అనుమతి
- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం
- ప్రాజెక్టుల సాకారానికి నిత్యం ట్రాకింగ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశం

అమరావతి: రాష్ట్రంలో రూ.44,778.40 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ సంస్థలు పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఆ ప్రాజెక్టుల ద్వారా 19,580 మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ తరువాయి 2లో



# కుంభమేళాలో మహాత్ముడు!



- ఆధ్యాత్మిక వేడుకలో స్వరాజ్య స్ఫూర్తి

మహాకుంభ్ నగర్: దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు తిరిగివచ్చి అపుడపుడే స్వాతంత్ర్య సంగ్రామంలోకి అడుగుపెడుతున్న మహాత్మాగాంధీ 1918 నాటి కుంభమేళాను సందర్శించి, ఆధ్యాత్మిక వేడుకలో స్వరాజ్యస్ఫూర్తిని రగిలించారు. 'మినీ ఇండియా'లా అన్ని ప్రాంతాల వ్యక్తులు గుమికూడే ఈ మేళాను భారతీయుల్లో పోరాటస్ఫూర్తిని నింపేందుకు సరైన వేదికగా మహాత్ముడు భావించారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా అలనాటి విశేషాలు చర్చకు వచ్చాయి. ''బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రజాసమూహాన్ని చైతన్యపరిచేందుకు మహాకుంభ్ ఓ మాధ్యమంలా ఉపయోగపడుతుందని బాపు భావించారు. నాటి మహాకుంభ్ స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ వర్గాల తరువాయి 2లో

# హెచ్1బీ వీసాలు 75,000లోపే ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

(చదువుతోపాటు ఉద్యోగం చేయడం). చదువు అయిపోగానే విద్యార్థి స్వదేశానికి తిరిగివెళ్లేలా అంగీకరించే విధానం ఉండాలి' అని జెస్సికా సూచించారు.

**కార్మికుల కొరత లేదు**

ప్రభుత్వ రంగంలోని ఉద్యోగాల్లో వీసా వర్కర్ల అనుమతిని సాధ్యమైనంత తక్కువకు కుదించాలని జెస్సికా సూచించారు. అమెరికాలో నైపుణ్య, నైపుణ్యంలేని కార్మికులకు కొరత లేదని, అలాంటి వారిని విదేశాల నుంచి తెచ్చుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 'సైన్సు, ఇంజినీరింగ్, టెక్నాలజీ, గణితాల్లో 20 లక్షల మంది అమెరికన్లు నిపుణులుగా ఉన్నారు. వారిలో ఆరో వంతు మంది నిరుద్యోగులుగా ఉన్నారు' అని వివరించారు. అందుకే వీసా కార్యక్రమాలను పూర్తిగా సంస్కరించి మరింత మంది అమెరికన్లకు అవకాశాలను కల్పించాలని సూచించారు. అసలు ఉద్యోగులే లేని కంపెనీలకే విదేశీ ఉద్యోగులను నియమించుకునే అవకాశమివ్వాలని అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుతం కొన్ని కంపెనీలు అమెరికన్లను తీసేసి తక్కువ వేతనాలపై పని చేసే విదేశీయులను నియమించుకుంటున్నాయి. ఇందులో అక్రమ నియామక ప్రక్రియలను అనుసరిస్తున్నాయి. అభ్యర్థుల నుంచి నియామక ఫీజులను వసూలు చేస్తున్నాయి.' అని జెస్సికా తెలిపారు. వీసా గడువు తీరినా ఉండే ఉద్యోగుల విషయంలో కంపెనీలే బాధ్యత తీసుకునేలా చేయాలని సూచించారు.

**హెచ్1బీకి రెండేళ్లు చాలు**

'వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్ 1బీ వీసాలను రెండేళ్లకే పరిమితం చేయాలి. అదనంగా రెండేళ్లు మాత్రమే పొడిగింపునకు అవకాశం ఇవ్వాలి. గ్రీన్ కార్డు పిటిషన్ వేసిన కారణంగా ఆటోమేటిక్‌గా పొడిగింపు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలి. హెచ్ 1బీ వీసాలను 75,000, అంతకంటే తక్కువకు కుదించాలి. అందులోనే లాభాపేక్ష రహిత, పరిశోధన రంగాలను జోడించాలి (ప్రస్తుతం లాభాపేక్ష రహిత, పరిశోధన రంగాలకు అపరిమిత హెచ్ 1బీ వీసాల జారీ అవకాశం ఉంది). ఒకవేళ హెచ్ 1బీ కేటగిరీలో ఎక్కువ మంది అర్హులుంటే అత్యధిక వేతనం పొందుతున్న వారికి ప్రాధాన్యమివ్వాలి' అని జెస్సికా వివరించారు.

# రాష్ట్రంలో రూ.44,778 కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం సచివాలయంలో గురువారం జరిగింది. 15 పునరుత్పాదక, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటు ప్రతిపాదనలకు మండలి ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఎస్ఐపీబీ భేటీ కావడం ఇది మూడోసారి. గత రెండు సమావేశాల్లో వరుసగా రూ.83,987 కోట్లు, రూ.1,82,162 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు మండలి ఆమోదం తెలిపింది. మూడు విడతల్లో కలిపి రూ.3,10,925 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదించింది. ఇవి కార్యరూపం దాల్చితే 3,12,576 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

* **పారిశ్రామిక రంగంలో 20% వృద్ధి లక్ష్యం**

ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 'రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడులతో అర్సెలార్ మిత్తల్ సంస్థ నెలకొల్పనున్న ఉక్కు పరిశ్రమకు, బీపీసీఎల్ రూ.96 వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్న చమురు శుద్ధి కర్మాగారాలకు మూడు నెలల్లో శంకుస్థాపన చేయనున్నాం. వీటికి అన్ని అనుమతులు త్వరితగతిన అందిస్తామ'ని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో 20% వృద్ధి సాధించాలన్నదే లక్ష్యమని చంద్రబాబు ప్రకటించారు. దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన డీపీ వరల్డ్, డెన్మార్క్‌కు చెందిన ఏపిముల్లర్, మార్క్స్ తదితర సంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి సమన్వయం చేయాలని అధికారులకు సూచించారు. 'రూ.10 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే ప్రతి ప్రాజెక్టునూ ట్రాకింగ్ చేయాలి. మంత్రులు, అధికారులు ఇందులో భాగమవ్వాలి. ఇప్పటికే ఆమోదించిన ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి' అని సీఎం సూచించారు.

**మండలి ఆమోదించిన ప్రాజెక్టులు**

అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలిలో 1,500 మెగావాట్లు, చిత్తంవలసలో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుల ఏర్పాటుకు నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు అనుమతి. ఆ సంస్థ రూ.14,328 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 3,450 మందికి ఉపాధి చూపనుంది.

అన్నమయ్య జిల్లా కొమ్మూరులో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.10,300 కోట్ల పెట్టుబడులతో పీఎస్‌పీ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి. 3 వేల మందికి ఉపాధి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆస్పిరి రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.917.85 కోట్ల పెట్టుబడితో 118.80 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు అనుమతి. 150 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

అనంతపురంలో 178.20 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనంతపురం రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి. రూ.972.23 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న సంస్థ. 225 మంది ఉపాధికి అవకాశం.

శ్రీసత్యసాయి జిల్లాలో కడప రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,163.11 కోట్ల పెట్టుబడితో 231 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి. 300 మందికి ఉపాధి లభించే అవకాశం.

ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రూ.1,651 కోట్ల పెట్టుబడితో 201.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి. 255 మందికి ఉపాధి చూపనుంది. ఇదే సంస్థ రూ.4,435.64 కోట్ల పెట్టుబడులతో 498.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ద్వారా 639 మందికి ఉపాధి చూపనుందని అంచనా. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 349.50 మెగావాట్ల పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుతో 1,200 మందికి ఉపాధి చూపనుంది. అనంతపురం జిల్లాలోనే రూ.567.73 కోట్ల పెట్టుబడులతో 42.90 మెగావాట్ల పవన, 52 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పడం ద్వారా 170 మందికి ఉపాధి చూపించే అవకాశం.

ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ1 ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అనంతపురం జిల్లాలో రూ.1,728.42 కోట్ల పెట్టుబడులతో 300 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి. 1,035 మందికి ఉపాధి అవకాశాలు.

ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ 2 ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వైఎస్సార్ జిల్లాలో రూ.1,728.42 కోట్ల పెట్టుబడులతో 300 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు. 1,035 మందికి ఉపాధి చూపనుంది.

టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలంలో రూ.2 వేల కోట్ల పెట్టుబడులతో 400 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి. 1,380 మందికి ఉపాధి లభించే అవకాశం.

కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కాకినాడలోని ఎరువుల తయారీ ప్లాంటు విస్తరణకు రూ.1,539 కోట్లతో చేసిన ప్రతిపాదనలకు ఆమోదం. ఈ ప్లాంటు ద్వారా 750 మందికి ఉపాధి దొరకనుంది.

అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలెప్) ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.305 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. సుమారు 6 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

# 95523 00009తో 161 సేవలు

అమరావతి: ప్రపంచంలోనే తొలిసారిగా 161 రకాల సేవలతో ఏపీ ప్రభుత్వం వాట్సప్ పాలనకు శ్రీకారం చుట్టింది. 'మన మిత్ర' పేరుతో దీన్ని తీసుకొచ్చింది. అధికారిక వాట్సప్ నంబరు 95523 00009ను ప్రభుత్వం కేటాయించింది. ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలికేందుకు ప్రభుత్వం దీన్ని తీసుకొచ్చింది. వరదలు, అత్యవసర, విద్యుత్తు ఉపకేంద్రాల మరమ్మతుల్లాంటి సమాచారాన్ని దీని ద్వారా అందిస్తారు. ఈ ఎకౌంట్‌కు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్కు) ఉంది. ఈ నంబరు వాట్సప్‌తో తొలివిడతలో విద్యుత్తు, దేవాదాయ, రెవెన్యూ, పురపాలకశాఖ, ఏపీఎస్ఆర్టీసీ సేవలతోపాటు వినతులు స్వీకరించేందుకు వీలుంటుంది. ఈ సేవలను ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రపంచంలో ఎక్కడా ఇన్ని సేవలు ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా తీసుకురాలేదు. ఇది అమలుచేస్తున్న తొలి రాష్ట్రం మనదే. ప్రభుత్వపరంగానూ ఎక్కడా లేదు. 'మనమిత్ర' ప్రజల చేతుల్లోనే ప్రభుత్వం. మాది ప్రజాప్రభుత్వం. ఈ ఆలోచన యువగళం పాదయాత్ర నుంచి మొదలైంది. ఒక బటన్ నొక్కితే ప్రభుత్వం ఎందుకు ప్రజల వద్దకు రాకూడదనే ప్రశ్న ఉత్పన్నమైంది. కుల ధ్రువీకరణ పత్రం ఎన్నిసార్లు తీసుకోవాలి? ఆదాయ ధ్రువపత్రం కోసం మళ్లీ అధికారుల వద్దకు ఎందుకు వెళ్లాలని పాదయాత్రలో నన్ను అడిగారు. గత ఐదేళ్లలో సర్టిఫికెట్లు రానివ్వకుండా చేశారు. దుగ్గిరాల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసిన తెదేపా అభ్యర్థికి ప్రభుత్వం బీసీ సర్టిఫికెట్ ఇవ్వలేదు. వ్యవస్థలో లోపాలను సరిచేయాలని భావించాను. ధ్రువపత్రాల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో ఇది మొదలైంది'' అని తెలిపారు. రెండు విడతల్లో 520 సేవలు ''భవిష్యత్తులో మరింత మెరుగ్గా 'మన మిత్ర' అమలుచేస్తాం. వచ్చే ఆరు నెలల్లో గణనీయమైన మార్పులను ప్రజలే చూస్తారు. రెండో విడతలో 360 పౌరసేవలను తీసుకువస్తాం. మొత్తం 520కి పైగా సేవలు వాట్సప్ ద్వారా అందించేందుకు కృషిచేస్తున్నాం. రియల్ టైమ్‌లోనే అన్నీ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల హాల్‌టికెట్లు సైతం విద్యార్థులు వాట్సప్ ద్వారా పొందొచ్చు. ఇకపై జారీచేసే సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ఇస్తాం. దీన్ని స్కాన్ చేస్తే ఏపీ ప్రభుత్వ వెబ్‌సైట్‌కు ఆ లింకు వెళ్తుంది. దీంతో నకిలీ సర్టిఫికెట్లకు ఆస్కారం ఉండదు. మెటాతో ఒప్పందం జరిగిన మూడు నెలల 9 రోజుల్లోనే దీన్ని ప్రారంభించాం. రెండోదశలో ఏఐ బాట్, వాయిస్ ద్వారానూ సేవలు అందిస్తాం. మలిదశ సేవలకు అనుగుణంగా ప్రభుత్వం చట్ట సవరణలు చేస్తుంది. ప్రస్తుతం తెలుగు, ఆంగ్ల భాషల్లో సేవలు అందిస్తున్నాం. రానున్న రోజుల్లో అన్ని భాషల్లోనూ ఉంటాయి'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, హెడ్ సంధ్యా దేవనాథన్, వాట్సప్ డైరెక్టర్, ఇండియా హెడ్ రవి గార్గ్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈఓ దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

- **బీసీలను విస్మరిస్తే ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం**
- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి డిమాండ్ చేశారు. ముస్తాబాద్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థలు ఎన్నికల కంటే ముందే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనతోపాటు ప్రకటించిన ఇతర సంక్షేమ, అభివృద్ధి అంశాలపై నిర్ణయం తీసుకోవాలని, ఆనాడు ఎన్నికలకు వచ్చే ముందు ఇచ్చిన హామీలు మొదటి అసెంబ్లీ సెషన్స్‌లోనే బీసీ సబ్ ప్లాన్‌కు నిధులు మంజూరు చేస్తామని, బీసీ సంక్షేమానికి లక్ష కోట్లు కేటాయిస్తామని, బీసీ ప్రెస్ క్లబ్‌లు, ఐక్యతా భవనాలు, స్టడీ సర్కిల్లు, క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని, బీసీలకు కొత్త గురుకులాలు ఏర్పాటు చేస్తామని, నవోదయ పాఠశాలలాగే బీసీలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా వృత్తి బజార్లు ఏర్పాటు, తెలంగాణ బీసీ సంఘం కుల వృత్తుల కార్పొరేషన్లకు విరివిగా నిధులు ఇచ్చి, పాలక మండళ్లను నియమించడం తదితర ఎన్నో అంశాలను కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పొందుపరచి ఇప్పుడు వాటి ఊసే మరచిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే విధంగా బీసీలపై చిన్న చూపు చూస్తే బీసీ మేధావులను, ఉద్యోగులను, నిరుద్యోగులను, రైతులను, కార్మికులను, కర్షకులను కలుపుకొని పెద్ద మొత్తంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని, బీసీలను విస్మరిస్తే ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్, కంచం నర్సింలు, పుల్లూరి శ్రీనివాస్, కోడె శ్రీనివాస్, పర్శరాములు, శేఖర్ చారి, బాలేల్లు, రాజు, మహేష్, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాకు అధికారుల తాకిడి

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు యూపీ సర్కారు నియమించిన త్రిసభ్య జ్యుడీషియల్ కమిషన్ శుక్రవారం కుంభమేళాను సందర్శించనుంది. మేళాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మొత్తం 360 పడకలతో 23 ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకువచ్చారు. అదనంగా 10 ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలహాబాద్ ఎంపీ ఉజ్వల్ రమణ్‌సింగ్ (కాంగ్రెస్) ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. తాము చేసిన ముందస్తు హెచ్చరికలను యూపీ సర్కారు పట్టించుకోలేదని, రద్దీ నియంత్రణలో అధికారుల భారీ వైఫల్యం కారణంగానే ప్రమాదం జరిగిందని ఆయన విమర్శించారు. కుంభమేళా అంతటా మోదీ, యోగీ చిత్రాలతో నింపేసి ప్రచార కార్యక్రమంగా మార్చేసిన భాజపా సర్కారు పెద్దలు తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహించాలని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలె డిమాండ్ చేశారు. గురువారం ముంబయిలో మొదలైన ట్రేడ్ షోలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ శెఖావత్ మాట్లాడుతూ.. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుభమేళాకు మొత్తం 30 లక్షలమంది అంతర్జాతీయ పర్యాటకులు రావచ్చని అంచనా ఉన్నట్లు వెల్లడించారు. మౌనీ అమావాస్య సందర్భంగా బుధవారం ప్రయాగ్‌రాజ్‌కు మొత్తం 364 రైళ్లు నడిపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

**సుప్రీంకోర్టులో పిటిషన్**

ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ విశాల్ తివారీ అనే న్యాయవాది తాజాగా సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేశారు. భవిష్యత్తులో ఎక్కడా ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనులో కోరారు. ఈ పిటిషనుపై యూపీ ప్రభుత్వం స్టేటస్ రిపోర్టును సమర్పించాల్సి ఉంటుంది.

**ధ్రువపత్రాల్లేకుండా మృతదేహాల అప్పగింత**

కోల్‌కతా: మహా కుంభమేళా తొక్కిసలాటలో పశ్చిమబెంగాల్ వాసులు ఇద్దరు మృతిచెందగా, ఏడుగురి ఆచూకీ ఇంకా తెలియడం లేదని సంబంధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా మృతదేహాలను తమకు అప్పగించారని వారు తెలిపారు.

**అయోధ్యకు 4 రోజుల్లో 65 లక్షల భక్తులు**

అయోధ్య: మౌనీ అమావాస్య అమృత స్నానాల కోసమని ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన భక్తులు చాలామంది అయోధ్య బాట పడుతుండటంతో సోమవారం నుంచి గురువారం మధ్యాహ్నానికి 65 లక్షలమంది రామ్‌లల్లాను దర్శించుకున్నారు. దీంతో రామమందిర దర్శన వేళలను 18 గంటలకు పెంచారు. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

## నేడు ఉస్మానియా ఆసుపత్రికి సీఎం భూమిపూజ

(మొదటిపేజీ తరువాయి)

కిందిభాగంలో ఒకేచోట అన్నిరకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణానికి సుమారు రూ.2500 కోట్ల నుంచి రూ.2700 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా. కొత్త భవనం ప్రారంభోత్సవం తర్వాత 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ 5 వేల మంది ఓపీ రోగులను చూసేలా.., 30 విభాగాలతో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు.

## యాదగిరిగుట్టలో మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

అర్చకులు, పండితుల బృందం గురువారం పయనమైనట్లు ఈవో తెలిపారు. ఐదు రోజుల మహా కుంభాభిషేకం నిర్వహణలో చివరి రోజు పుణ్య నదుల జలాలతో మహా సంప్రోక్షణ క్రతువు చేపట్టనున్నారు. సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అదనపు డిప్యూటీ కమిషనర్ లక్ష్మీకాంతారావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఏసీపీలు సైదులు, రమేశ్‌తో పాటు ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. స్వర్ణ విమానం ఆవిష్కరణ క్రతువుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని యాదగిరిగుట్ట దేవస్థానం ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినందున.. సీఎం పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రభుత్వం ఈసీకి లేఖ రాయనున్నట్లు ఈవో తెలిపారు.

## అమెరికా విమాన ప్రమాదం.. ప్రెస్‌మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేసిన ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

నిశ్శబ్దం పాటించారు. ఈ సందర్భంగా విమాన దుర్ఘటనకు సంబంధించి పలు విషయాలు వెల్లడించారు. బాధితుల జాడ కోసం నిరంతరం శ్రమిస్తున్న రెస్క్యూ టీమ్‌ను అభినందించారు. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో మిగల్లేదని ప్రకటించారు. ఈ ప్రమాదం చాలా మందిని కుదిపేసిందన్నారు. అమెరికాలోనే కాకుండా ఇతర దేశాల్లోని ప్రజలపై దీని ప్రభావం ఉందని తెలిపారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారిలో రష్యా జాతీయులు సైతం ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రమాదం తనను ఎంతో వేదనకు గురిచేసిందన్నారు. ఈ విమాన ప్రమాదం ఎలా జరిగిందో విచారణ చేపడుతామని, మరోసారి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (FAA), నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు, యూఎస్ మిలిటరీ సమగ్రంగా దర్యాప్తు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఎఫ్ఏఏకు తాత్కాలిక కమిషనర్‌ను నియమిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. విమాన ప్రమాదం జరిగిన సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో జరిగిన సంభాషణల టేపులను తాను విన్నానని తెలిపారు. ఈ ఘటన వెనక పైలట్ తప్పిదం ఏమైనా ఉందా అని అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిచ్చారు. విమానం సరైన మార్గంలోనే వెళ్లిందని, పైలట్ తప్పిదం లేదని పేర్కొన్నారు.

## కుంభమేళాలో మహాత్ముడు!

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు, విప్లవకారులు, పాత్రికేయులు, రచయితలకు సమావేశ స్థలిగా మారింది'' అని అలహాబాద్ విశ్వవిద్యాలయ సెంటర్ ఆఫ్ మీడియా స్టడీస్ కోర్స్ కోఆర్డినేటరు ధనంజయ్ చోప్రా తెలిపారు. రీజనల్ స్టేట్ ఆర్కైవ్స్‌లో భద్రపరచిన రికార్డుల ప్రకారం నాటి కుంభమేళాకు విచ్చేసిన గాంధీ పర్యటనను బ్రిటిష్ అధికారులు ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా డాక్యుమెంట్ చేసినట్లు చోప్రా వెల్లడించారు. కుంభమేళాలో పరిశుభ్రత లోపంపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాపు.. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజల్లో క్రమశిక్షణ చాలా అవసరమని అభిప్రాయపడినట్లు ఆయన ముని మనవడు తుషార్‌గాంధీ తెలిపారు. 1948 జనవరి 30న మహాత్ముడు మరణించాక ఆయన చితాభస్మాన్ని ఫిబ్రవరి 12న త్రివేణీసంగమంలోనే నిమజ్జనం చేశారు.

## బందనకల్ జడ్పిహెచ్ఎస్‌లో పోలీస్ అక్క అవగాహన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ముస్తాబాద్ మండలంలోని బంధనకల్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్వరూప ద్వారా పోలీస్ అక్క ప్రోగ్రామ్‌ను గురువారం నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ గురించి, సెల్ ఫోన్ మోసాల గురించి అవగాహన కల్పించారు. 100 డయల్ ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా గాంధీ వర్ధంతి, అమరవీరుల స్మారక దినోత్సవం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో గాంధీ వర్ధంతి,అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన , జిల్లా అధికారులు కార్యాలయ సిబ్బంది.రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## సీనియర్ జర్నలిస్ట్ కబీర్ కౌశల్ కు జన్మదిన శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : సీనియర్ జర్నలిస్ట్ కబీర్ కౌశల్ కు మియాపూర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు కిరణ్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు శ్రీధర్ ,రాజేష్ గౌడ్, నరసింహ గౌడ్, మన్నె మోహన్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ ప్రణయ్, శ్రీపతి తదితరులు అభినందనలు తెలియజేశారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచాలి

* **మియాపూర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్**



శేరిలింగంపల్లి , ప్రజాస్ఫూర్తి : ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు పరచాలని మియాపూర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మియాపూర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్ పాల్గొని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వినతి పత్రంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ అధ్యక్షులు కిరణ్ తో పాటు రోజా కలిదిండి, గోపరాజు శ్రీనివాసరావు, శ్రీధర్, చిన్న, రమేష్, సంతోష్, నరసింగరావు, జహంగీర్, సురేష్ గౌడ్ నర్సింగ్, రాజు, ముజీబ్బ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు



# జర్నలిజం వృత్తిని అపవిత్రం చేస్తే ఊరుకునేది లేదు

* **-TUWJ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ**

**(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) :** సమాజ జ్ఞానం, జర్నలిజం విలువల పట్ల అవగాహనా లేకుండా, జర్నలిస్టుల పేరుతో సంచరిస్తూ, దోపిడికి పాల్పడుతూ పవిత్రమైన జర్నలిజం వృత్తికి మచ్చ తెస్తున్న నకిలీ ముఠాలకు తగినరీతిలో బుద్ధి చెప్పక తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ హెచ్చరించారు. గురువారం నాడు స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన గజ్వేల్ నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశం, యూనియన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టుల పేరుతో కొన్ని అసాంఘిక శక్తుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ముఠాల కదలికలపై తమ సంఘం కన్నేసి పెట్టిందని, చట్టపరంగా వారికి శిక్ష పడేలా చర్యలు చేపడుతున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేశారు. సుదీర్ఘ సామాజిక చరిత్ర కలిగి ఉన్న గజ్వేల్ ప్రెస్ క్లబ్ ను స్థాపించి 25యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా రజతోత్సవాలు జరిపేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఇండ్లు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల మంజూరీ తదితర సంక్షేమ చర్యల అమలు కోసం ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేందర్, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జగదీశ్, కిరణ్, మునీర్, యాదగిరి తదితరులు మాట్లాడారు.

## కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలి

**సౌత్ సెంట్రల్ రైల్వే డి. ఆర్. యు. సి. సి. మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే బడ్జెట్ లో కొత్తగూడెం కేంద్రంగా నిర్మించే కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయించాలని సౌత్ సెంట్రల్ రైల్వే డి. ఆర్. యు. సి. సి. మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు మెయిల్స్ ద్వారా వినతి పత్రాలను పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం కేంద్రంగా నిర్మించే కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన తక్షణమే నిర్మాణం పూర్తి చేసి తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలన్నారు. కరోనా సమయములో రద్దయిన రైళ్లను, కొలహపూర్ ఎక్స్ప్రెస్ రైలును తిరిగి తక్షణం ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం కేంద్రంగా రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం నుండి డోర్నకల్ వరకు డబుల్ ట్రాక్ నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని, అమృత్ భారత్ నిధుల ద్వారా నిర్మిస్తున్న రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శిరిడీకి కొత్తగూడెం నుండి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని భద్రాచలం రామాలయానికి భక్తుల సౌకర్యార్థం రైల్వే లైన్ తో పాటు ప్రత్యేక రైలును నడపాలని శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రులకు సెంట్రల్ రైల్వే అధికారులకు విన్నవించారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్నికల ప్రవర్తన నియమావళి పై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ప్రభుత్వ పాఠశాలలో , కళాశాలల ప్రిన్సిపల్ లు ,మునిసిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి మనలోకి వచ్చిందని ఆయన తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ స్థానాలతో పాటు వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న జారీకానుండగా ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారని, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు గడువు విధించారని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, మార్చి మూడవ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, బస్టాండ్, పబ్లిక్ పార్ వంటి ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, స్టికర్లు తొలగించాలని ఆదేశించారు. ప్రజలను ప్రభావితం చేసేలా గోడలపై ఉన్న రాతలను చెరిపివేయాలని, దేశ, రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలను కవర్ చేయాలన్నారు.

## కలెక్టరేట్‌లో మహాత్మ గాంధీ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జాతిపిత, స్వాతంత్ర్య సమర యోధుడు మహాత్మ గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా శాఖల ఉన్నతాధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళి అర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం వారు పోరాడిన తీరు, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఓ రాంరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బిసి యువజన సంఘం గ్రామాల అధ్యక్షుల నియామకం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: జాతీయ బిసి యువజన సంఘం ముస్తాబాద్ మండల శాఖ అధ్యక్షులు శీల ప్రశాంత్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల అధ్యక్షులను గురువారం నియమించారు. జాతీయ బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దండు వినోద్ సమక్షంలో ఈ నియామకాలు చేపట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ కార్యదర్శి అమరగొండ అజయ్ హాజరై మాట్లాడారు. బిసి సమస్యలపై జాతీయ బిసి యువజన సంఘం ఇచ్చే పిలుపులో పాల్గొంటూ పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా నియమితులైన వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు రంజాన్ నరేష్, మండల ఉపాధ్యక్షులు మెరుగు నవీన్, మండల కోశాధికారి ఊరడి ప్రశాంత్, మిరుదొడ్డి భాను, తాడేపు కొమురయ్య, డికొండ దశరథం, నర్మాల స్వామి తదితరులున్నారు.



## మహాత్మా గాంధీ చూపించిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలి

* **సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. చంటి ముదిరాజ్**

వనస్థలిపురం , (ప్రజాస్ఫూర్తి) : జాతిపిత మహాత్మా గాంధీ చూపించిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం లో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి లు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ సూచనలను అనుసరిస్తూ యువత అడుగులు వేయాలని అన్నారు.సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అన్నివేళలా ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

# అమలు కానీ హామీలతో కాంగ్రెస్ అధికారం చేపట్టింది

*** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి**



బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : అమలు కానీ హామీలతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందని బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినప్పటికి ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీ లు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. రైతుబంధు ఇప్పటివరకు అడ్రెస్ లేదని, రైతు భరోసా ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ ,మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి ,సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్ ,కొత్త చక్రపాణి గౌడ్ ,కాటేపల్లి రామచంద్రా రెడ్డి ,మీసాల యాదగిరి ,బోడగల్ల సదనాంద్ ,శ్రీధర్ గౌడ్ ,కామగల్ల నరసింహ ,బొమ్మకు విశ్వనాథ్ ,తాల్క శత్రజ్ఞ ,పి.వి సురేష్ కుమార్, చంటి శ్రీనివాస్, ఎమ్. శ్రీకాంత్ ,ఉప్పరి విజయ్,శేషి ,సిహెచ్ .వినయ్ ,కె.మల్లేష్,కె.సత్యం రెడ్డి,జడిగే మురలి యాదవ్ ,రాజిరెడ్డి,శ్రీనివాస్ యాదవ్ ,కె.రవి లతో పాటు తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేసింది

*** ఆల్విన్ కాలనీ బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు**



శేరిలింగంపల్లి , (ప్రజాస్ఫూర్తి ) : కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆల్విన్ కాలనీ బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఆల్విన్ కాలనీ డివిజన్లో 420 హామీలపై బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి సతీష్ రావు మాట్లాడుతూ. అబద్ధపు మాటలతో బూటకపు హామీలతో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏ హామీలు నెరవేర్చిందని ఆల్విన్ కాలనీ బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ప్రశ్నించారు. 420 రోజుల్లో ప్రజల సమస్యలు ఏం నెరవేర్చారని ఏమి అభివృద్ధి చేశారని సతీష్ రావు ప్రశ్నించారు. 420 హామీల్లో ఏ హామీలను నెరవేర్చిందన్నారు. ఓటు వేసి తప్పు చేశామన్న మనో భావన ప్రజలకు కలిగిందని రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ సర్కార్ కి, రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయన్నారు. తప్పుడు మాటలతో ప్రజలు నమ్మి ఓటేస్తే నటింట ముంచిన రేవంత్ రెడ్డి సర్కార్ కు రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సీనియర్ నాయకులు రాములు గౌడ్, సాయి గౌడ్, సుబ్బరాజు, బాపూజీ రాజు, హరి, రమేష్ సాగర్, కర్ణాటక రాజు, మనీష్, రాజు, ఎండి మున్నీర్, అనిల్ ,రమేష్, శ్రీనివాస్, కృష్ణ, సాయి, రాంరజ్ , సంతోష్, ఆకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తుల్లో మహాత్మాగాంధీజీ ఒకరు

*** యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్**



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తుల్లో మహాత్మాగాంధీజీ ఒకరు అని యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ అహింస అనే అయుధంతో సూర్యుడస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, భరతమాతకు దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహోన్నతుడు అని అన్నారు. మనకు అహింస, సత్యాగ్రహం అనే పదునైన ఆయుధాలను పరిచయం చేసి, వాటిని వాడటానికి కూడా ఎంతో ధైర్యం కావాలని నిరూపించారన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలు, జీవన విధానం ప్రతి వ్యక్తికి ఆదర్శం అవ్వాలని అన్నారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, షౌకత్ అలీ మున్నా, రవీందర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత... మన అందరి బాధ్యత

**: ఎస్పీ రోహిత్ రాజు**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు భద్రత... మన అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియంలో వాహనదారులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ సూచనలతో సబ్ డివిజన్ పోలీసులు వాహనదారులకు,విద్యార్థినీ ,విద్యార్థులకు ముఖ్యంగా ఆటోడ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా భారీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారు.ఎస్పీ తో పాటు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్ శేషాంజనేయ స్వామి,జిల్లా రవాణాధికారి వెంకట రమణలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా దేశంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి చాలామంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు.వాహనదారులందరూ హెల్మెట్ ,సీట్ బెల్ట్ లు ధరించి వాహనాలను నడపాలని కోరారు.ర్యాష్ డ్రైవింగ్ ,మద్యం సేవించి వాహనాలు నడపడం,ఓవర్ లోడ్,రాంగ్ రూట్లో ప్రయాణించడం లాంటి తప్పిదాలతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే ప్రతి ఒక్కరూ కూడా ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలను ఉపయోగించుకోవాలని సూచించారు.పోలీస్ శాఖతో పాటు ప్రజలతో నిరంతరం ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉండేది ఆటో డ్రైవర్లు మాత్రమే అని అన్నారు.పోలీసు వారు సూచించిన నియమాలను పాటించి ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి బాధ్యత గల పౌరులుగా కూడా మెలగాలని కోరారు. ముందుగా విద్యార్థులతో కలిసి అక్కడ రోడ్డు భద్రతా నియమాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 500 కు పైగా ఆటో డ్రైవర్లు తమ వాహనాలతో సహా హాజరయ్యారు..అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వేల ఆటోలకు సంబంధించి పోలీస్ శాఖ తరపున తయారుచేసిన స్టిక్కర్లను ఎస్పీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం, జిల్లా పౌరసంబంధాల శాఖ కళాకారుల చేత ట్రాఫిక్ అవగాహనపై పాటల రూపంలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది.అనంతరం ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేసిన కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,ట్రాఫిక్ ఎస్ఐలు నరేష్,మదార్ , పట్టణ సీఐలు కరుణాకర్,రమేష్,శివ ప్రసాద్ జూలూరుపాడు సీఐ ఇంద్రశేనారెడ్డి లను శాలువాలతో ఎస్పీ సత్కరించారు.

# రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే అనవసరపు ఆరోపణలు

- *** నిరాదరమైన ఆరోపణలు చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు ఉంటాయి**
- *** కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ కార్పొరేషన్ 13 వ డివిజన్ ఇంచార్జ్ జెన్న రాజు**



బోడుప్పల్ , (ప్రజాస్ఫూర్తి) : నిరుపేద కుటుంబంలో పుట్టి రెక్కలు ముక్కలు చేసుకోని కుటుంబ సభ్యుల మద్దతుతో రాజకీయాల్లోకి వచ్చి ఆటు రాజకీయాల్లో ఇటు వ్యాపారంలో ఎదుగుతున్న తనపై కొందరు వ్యక్తులు నిరాదరామైన ఆరోపణలు చేస్తూ తనతో పాటు, తన కుటుంబ సభ్యులను మానసిక క్షోభకు గూరి చేస్తూ తనను ఇబ్బందుల పాల్జేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ కార్పొరేషన్ 13 వ డివిజన్ ఇంచార్జ్ జెన్న రాజు అన్నారు. గురువారం దేవేందర్ నగర్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాలనీ వాసులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ లోని రిక్షపుల్లర్ కాలనీలో తన తండ్రి రిక్ష కార్మికుడిగా,నా తల్లి పలు ఇండ్లలో పని చేసి మమ్మల్ని ఈ స్థాయికి వచ్చానని నేను చదువు పూర్తి కాగానే ప్రయివేటు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబ సభ్యుల సహకారంతో చిన్నపాటి వ్యాపారం మొదలు పెట్టి ప్రజా సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. అయితే 2020 సంవత్సరంలో వచ్చిన కార్పొరేషన్ ఎన్నికలలో తనను పోటీ చేయకుండా అడ్డుకున్నారని అయిన పార్టీ సూచించిన అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసి గెలిపించానని అన్నారు.అప్పటి నుండే తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి తనపై తప్పుడు కేసులు పెట్టించి తనను ఇబ్బందుల పాల్జేశారను వాపోయాడు. నేను ఉన్న లేకున్నా మా కాలనీలో జరిగే ప్రతి అంశాన్ని తనకు ఆపాదిస్తూ తనపై లేని పోని ఆరోపణలు చేస్తూ తనను తన కుటుంబాన్ని అప్రతిష్టకు గురి చేస్తున్నారని అన్నారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కొంతమంది బోడుప్పల్ పెద్దమనుషులు నోరు తెరిస్తే బతుకువచ్చినోళ్ళు అని మా ఇండ్ల దగ్గరికి వచ్చి దాడులు చేస్తున్నారు. బూతులు తిడుతున్నారు. అంటే బ్రతికి వచ్చిన వాళ్ళు రాజకీయం చేయొద్దా నా యువసేన మిత్రులను తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది చేస్తున్నారు. కొంతమంది పత్రిక మిత్రులు నాపై తప్పుడు రాతలు రాస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో నా భవిష్యత్తు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక్కడ గొడవ జరిగిన కొంతమంది నా పేరుతో మీడియా ముందల నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఇక్కడ గొడవలు జరగడానికి కారణం బోడుప్పల్ కొంతమంది పెద్ద మనుషులు సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షులు దుప్పల్లి భగవంతు, మాల్ద కృష్ణ, జోగు సుధాకర్, మొగిలిపాక శంకర్, కాటం స్వామి, బైరు మధు, కర్ర బీరప్ప, స్థానిక శశి కుమార్, మురళి గౌడ్, ఏనుగు శ్రీశైలం, జన్న ధర్మయ్య, నకిర్త సోమేశ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్పొరేటర్ల సస్పెండ్ చేసి కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : ప్రజా సమస్యలపై చర్చించి బడ్జెట్ మీటింగ్ పెట్టాలని అడిగినందుకు సస్పెండ్ చేసి అరెస్టు చేయడం కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. గురువారం జరిగిన జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి , సమస్యల గురించి మేయర్ ను నిలదీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మాట్లాడుతూ అభివృద్ధి , సమస్యల గురించి మేయర్ ను నిలదీయడంతో సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్లను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి బీఆర్ఎస్ పార్టీ ద్వారా ఎన్నికై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార పార్టీలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని ఉద్దేశంతోటి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయి ఈరోజు మమ్మల్ని సస్పెండ్ చేయడం ఆమెకు తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత మీరు మేయర్ గా పార్టీ మారి ఈ 14 నెలల కాలంలో జిహెచ్ఎంసి అభివృద్ధి గురించి ఎన్ని రూపాయలు మంజూరు చేశారని అడిగారు గత 14 నెలల కాలంలో స్ట్రీట్ లైట్స్ రాకపోవడం ,శానిటేషన్ సరిగా చేయకపోవడం, కొత్తగా అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడ ఇలాంటి దారుణ పరిస్థితిలు జిహెచ్ఎంసి ఏర్పడినప్పుడు నుండి ఎప్పుడు లేవన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జిహెచ్ఎంసి కి శానిటేషన్ విషయంలో ఎన్నో అవార్డులు వచ్చాయని, నాళాలు కానీ వంతెనలు గాని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రజా సమస్యలపై మేయర్ ను అడుగగా సమాధానం చెప్పకుండా బిఆర్ఎస్ కార్పొరేటర్లు అందరినీ అరెస్టు చేయించి రాంగోపాల్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# మహాత్మాగాంధీ ఆశయాలు, జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం అవ్వాలి

*** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్**



శేరిలింగంపల్లి: ప్రజాస్ఫూర్తి : జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు, జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం అవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని మాక్తా మహబూబ్ పేట్ లోని మహాత్మాగాంధీ విగ్రహానికి మియాపూర్ డివిజన్ నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస, శాంతియుత పోరాటం ద్వారా మన హక్కులను పొందగలం అనే మార్గం చూపిన మహనీయుడని, మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తుల్లో మహాత్మాగాంధీజీ ఒకరని, ఆయన మనకు అహింస, సత్యాగ్రహం అనే పదునైన ఆయుధాలను పరిచయం చేసి, వాటిని వాడటానికి కూడా ఎంతో ధైర్యం కావాలని నిరూపించిన గొప్ప వ్యక్తి అని అన్నారు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్,రాష్ట్ర ,జిల్లా నాయకులు ,డివిజన్ అధ్యక్షులు,బీజేవైఎం నాయకులు, ఎస్సీ ఎస్టీ మోర్చా నాయకులు , భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ ఆశయాలను సాధించాలి

*** పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్ష అభ్యర్థి ఊట్ల చంద్రారెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజా స్ఫూర్తి) : అహింస మార్గంలో భారత దేశనికి స్వతంత్ర తీసుకువచ్చిన మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను సాధించాలని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్ష అభ్యర్థి ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం జాతిపీత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బస్తీలోని చంద్రారెడ్డి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాత్ముని చిత్రపటానికి చంద్రారెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముని అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏప్రిల్ 7న జరిగే ఎన్నికల్లో శాంతికి చిహ్నామైన ఆవు దూడ గుర్తుపై ఓటు వేసి మరోమారు అధ్యక్షుడిగా గెలిపించాలని చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. నాయకులు భగవంత రెడ్డి, ధర్మారావు , కెవి రాజు, కె.వెంకటేష్, అడెపు ప్రభాకర్, వనం ఆంజనేయులు, తాటి కిరణ్, కనక రెడ్డి, శంకర్ రెడ్డి, కృష్ణారెడ్డి , రంగారెడ్డి, భాస్కర్ గుప్త, శేఖర్ రెడ్డి, వీరేశం, తిరుపతి రెడ్డి, కిరణ్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మా గాంధీ కి ఘన నివాళి



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీ.పీసీసీ చీఫ్ బీ. మహేష్ కుమార్ గౌడ్ పాటు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని నివాళ్ళులర్పించారు.

## హైదరాబాద్ లో పెరుగుతున్న చర్మ సమస్యలు

**: డాక్టర్ ఉష గడ్డం..**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : గత కొన్ని రోజులుగా హైదరాబాద్ నగరంలో చలి పెరగడంతో వాయునాణ్యత సూచి (ఏక్యూఐ) దారుణంగా ఉండడంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని మణికొండ అపోలో క్లినిక్లో జనరల్ ఫిజిషియన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ ఉష గడ్డం అన్నారు.చర్మ సమస్యలు బాగా ఎక్కువయ్యాయని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.తమ క్లినిక్ కు రోజూ 58 మంది రోగులు డెర్మటైటిస్, మొటిమలు, పిగ్మెంటేషన్, ఎలర్జీల్లాంటి చర్మసమస్యలతో వస్తున్నారనీ తెలిపారు. ఇదంతా వాయుకాలుష్యం వల్లనే వస్తోందనీ, వాయునాణ్యత, ఆరోగ్యంపై దాని ప్రభావం తెలియాలంటే ఏక్యూఐ అనేది కీలకం అన్నారు. 50 లేదా అంతకంటే తక్కువ ఏక్యూఐ ఉంటేనే వాయునాణ్యత బాగున్నట్లు అని మన చర్మం వాయుకాలుష్యానికి బాగా గురవుతుంటుందన్నారు. మసి, పొగ, అచ్చు, పుప్పొడి, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి కాలుష్య కారకాలు నేరుగా తగలడం, జుట్టు ద్వారా వెళ్లడం, పీల్చుకోవడంతో చర్మంలోకి చొచ్చుకుపోతాయన్నారు. హైదరాబాద్ లోని ఇతర ప్రాంతాల అపోలో క్లినిక్ వైద్యుల వద్దకు కూడా రోజూ ఇలాంటి సమస్యలతో చాలామంది రోగులు వస్తున్నారనీ, వాయు కాలుష్యాలు చర్మం సహజ అవరోధాన్ని బలహీనపరుస్తాయని తెలిపారు.

## ఫ్లెక్సిబుల్ ఫైనాన్సింగ్ ఆప్షన్లతో విద్యార్థులకు టాటా క్యాపిటల్ మద్దతు..

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులు సన్నద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో, టాటా గ్రూప్ వారి ఫ్లా ప్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ టాటా క్యాపిటల్ లిమిటెడ్ (టీసీఎల్) తన విద్యా రుణ ఆఫర్లతో కుటుంబాల ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి అడుగులు వేస్తోంది.మేనేజ్ మెంట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ (క్యాట్, ఎక్సటీ, స్నాప్), విదేశాల్లో ఉన్నత విద్యకు ప్రామాణిక పరీక్షలు (జీఆర్తో, శాట్, జీమ్యాట్), ఇంగ్లీషు భాష ప్రావీణ్య పరీక్షలు (ఐఈఎల్ టీఎస్, టోఫెల్) వంటి క్లిష్టమైన పోటీ పరీక్షల ఫలితాలు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం మంచి కోర్సులను ఎంచుకుంటున్నారు. అడ్మిషన్ల గడువు సమీపిస్తుండటంతో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు కళాశాల అడ్మిషన్లలో కీలక దశను దాటుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి వారి ఆర్థిక అవసరాలను అర్థం చేసుకున్న టాటా క్యాపిటల్ సౌకర్యవంతమైన విద్యా రుణాలను అందిస్తోంది. తద్వారా విద్యార్థులు ఆర్థిక సమస్యలు లేకుండా తమ ఆకాంక్షలపై దృష్టి సారించేలా చేస్తుందని పేర్కొంది.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన యువ నేత



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగుడా వార్డ్ ఆఫీస్ లో ఇందిరమ్మ ఇండ్ల కోసం నూతనంగా స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియను గురువారం యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ ప్రజాపాలన లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు , ఇంతకు ముందు దరఖాస్తు చేసుకుని ఆన్ లైన్ లో పేరు రానివారు శంషిగుడా వార్డ్ కార్యాలయం వద్దకు వెళ్లి ఇందిరమ్మ ఇండ్ల కోసం నమోదు చేసుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, వార్డ్ ఆఫీస్ అడ్మిన్ శ్రీనివాస్, ఆపరేటర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వం సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రజలను మోసం చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటికీ 420 రోజులు పూర్తయినందున ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఈ పాలకులకు బుద్ధిని ప్రసాదించు మహాత్మ అంటూ.... బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం జీడిమెట్ల గ్రామ చౌరస్తా వద్ద నిర్వహించిన మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత కార్యక్రమానికి ఆయనతో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకులు, కార్యకర్తలతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా, ప్రజలు ఏమైపోతే మాకేంటి అనే రీతిలో అమలుకు సాధ్యం కానీ 420 బూటకపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అభయహస్తం అంటూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే తెలంగాణ ప్రజల పాలిట బస్మాసుర హస్తంగా కాంగ్రెస్ పాలన తయారయిందన్నారు. బతుకమ్మ చీరలతో తెలంగాణ ఆడపడుచులకు గౌరవం కల్పిస్తూనే, మరోపక్క చేనేత కార్మికుల సంక్షేమ నాయకుడిగా కెసిఆర్ నిలిస్తే.... ఈ పాలకులు మాత్రం బతుకమ్మ చీరల పంపిణీని



బంద్ చేసి 30 మంది చేనేత కార్మికుల ఆత్మహత్యలతో నేతన్నల పాలిట యమకింకరులుగా మారారన్నారు. మూసీ ప్రక్షాళన అంటూ పేద ప్రజలు ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇండ్లను కూల్చివేస్తూనే అభివృద్ధి పేరుతో తెలంగాణ ప్రజలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు అదే మూసీలో కలపడం ఖాయమన్నారు. మార్పు పేరుతో అమాయక ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకుల్లారా.... మీ అనాలోచిత నిర్ణయాలతో గత 420 రోజుల మీ పాలనలో వందమంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవడమేనా మీరు కోరుకున్న ఈ మార్పు. ఇదేనా మీరు చూపిస్తామన్న అసలైన మార్పు అని అన్నారు. గురుకులాలలో పౌష్టికాహారాన్ని అందిస్తూ ఉన్నత చదువులు అభ్యసించాలన్న నిరుపేద విద్యార్థుల కలను నెరవేర్చిన ఘనత మా అధినేత కేసిఆర్ అయితే, పురుగులన్నంతో 55 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్న ఘనకీర్తి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతే దేశానికి వెన్నుముక అని నమ్మి గత పాలకుల పాలనలో దండగగా మారిన వ్యవసాయాన్ని మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలతో పండగగా మార్చిన గొప్ప దార్శనికులు, తెలంగాణ రాష్ట్ర సాధకులు కెసిఆర్. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారమే లక్ష్యంగా మేము అధికారంలోకి వస్తే రైతు భరోసా కు 15 వేలు, రైతు కూలీలకు 12 వేలు ఇస్తామని రైతులను నమ్మించి గొంతు కోసింది. రైతు భరోసాను పెంచే విషయం పక్కకు పెడితే ఉన్న 12 వేలకు కూడా అర్హతల పేరిట అడ్డగోలు కొర్రీలను పెడుతూ ఒకసారి సంక్రాంతి, మరోసారి జనవరి 26, ఇంకొకసారి మార్చి 31 అంటూ రైతులను బూటకపు మాటలతో మోసం చేస్తున్నారే తప్పా రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుంది అన్న నమ్మకం రైతన్నకు ఇసుమంతైనా లేదన్నారు. ఇప్పుడు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మరో కొత్త నాటకానికి తెర లేపుతూ ఇదొక చారిత్రాత్మక కార్యక్రమం, గతంలో ఎప్పుడూ లేదు అనే విధంగా చెబుతున్న ముఖ్యమంత్రి భావదారిద్రాన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు.. 2021 లోనే మా కేసీఆర్ ప్రభుత్వంలోనే ఆన్లైన్ విధానం ద్వారా సుమారు 6,47,479 నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. దానికి సాక్ష్యం మీ నాయకులు భట్టి కూడా ఈ పంపిణీలో పాల్గొన్నారన్నారు. గరిష్టంగా కుటుంబానికి 20 కిలోలు అన్న పరిమితిని ఎత్తివేసి ఒక్కొక్కరికి ఆరు కిలోల లెక్కన ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రేషన్ ను అందజేశామన్నారు. నేడు ఈ కాంగ్రెస్ పాలకులు మాత్రం గ్రామసభలు, వార్డు సభల పేరుతో నానా హైరాన చేస్తూ జాబితాలను ప్రకటిస్తూ మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అసలు వాళ్లు వెల్లడించే జాబితా అర్హుల జాబితానా...? దరఖాస్తుదారుల జాబితానా...? అనేది వారికే స్పష్టం లేదన్నారు. సంక్షేమ పథకాల విషయంలో మంత్రుల మాట ఎవరికి వారే... యమునా తీరే అన్నట్టుగా తయారైంది.మహాత్మా గాంధీ పేరుతో గద్దెనెక్కిన ఈ డూప్లికేట్ గాంధీలకు, దద్దమ్మ కాంగ్రెస్ సర్కారుకు 420 హామీలు అమలు చేసే విధంగా ఆ మహాత్ముడు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నాం.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్వి ప్రెసిడెంట్ దండుగుల అఖిల్, ఉపాధ్యక్షులు కొర్ర ప్రవీణ్ నాయక్, మహేష్, రతన్, రవి కిరణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే ఇప్పటి సమస్యలకు నిదర్శనం

*** ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సుడిగాలి పర్యటన**





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే ఇప్పటి సమస్యలకు నిదర్శనమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం మాజీ ఎమ్మెల్యే దూల్లపల్లి రోడ్డు వయా నూజివీడు సీడ్స్ నుండి ఒక కిలోమీటర్ మేర కొంపల్లి శివాలయం వరకు.. నడుచుకుంటూ వెళ్లి బాబ్రా విల్లాస్, ఆదిత్య రాయల్ పార్క్, అపర్ణ పామ్ గ్రూప్స్, సిల్వర్ లీఫ్ విల్లాస్, గ్రీన్ కౌటి, అపర్ణ పేస్3లో సుడిగాలి పర్యటన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి ఆగిపోయిన దూల్లపల్లి వయా నూజివీడు సీడ్స్ నుండి కొంపల్లి శివాలయం వరకు రోడ్డు , డ్రైనేజీ ఏర్పాటు త్వరగా పూర్తయ్యేలా చూడాలని డీఈని ఆదేశించారు. బాబ్రా విల్లాస్, రాయల్ పార్క్, ఆదిత్య, అపర్ణ పామ్ గ్రోవ్ , సిల్వర్ లీఫ్ విల్లాస్, గ్రీన్ కౌటి, అపర్ణ పేస్ 3, అవేని విల్లాస్ లో దాదాపు 1000 కుటుంబాలకు డ్రైనేజీ, రోడ్డు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి ఈ సమస్యను చేరవేసి నిధులు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. కాంట్రాక్టర్లను, అధికారులను పరుగులు పెట్టించి.. పని చేపిస్తానని కాలనీవాసులకు మాట ఇచ్చారు. అనంతరం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తో మాట్లాడి.. అతి త్వరగా రోడ్డు , డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ, రోడ్డు ఏర్పాటు కోసం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మాజీ కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, జై బేరి గోపాల్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, ఏ శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, ఆంజనేయులు, రామ్ గౌడ్,కృష్ణ, నాగేందర్, చందు నాయక్, కాలనీ అధ్యక్షులు, అసోసియేషన్ అధ్యక్షులు, వివిధ కాలనీ వాసులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుంది

**: కార్పొరేటర్లు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని పలువురు కార్పొరేటర్లు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు గురువారం వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, గురువారం కేపీహెచ్ బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, , మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు లు పాల్గొని కెపిహెచ్ బీ రోడ్ నంబర్ 1లో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 420 హామీ లిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పాలకులకు బుద్ధి ప్రసాదించాలని గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో 420 రోజులు పూర్తి చేసుకుందన్నారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలలో ఆరు గారంటీలు 420 హామీలు వందరోజుల్లో చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకొని ముఖ్యమంత్రి అయిన తర్వాత వాటి గురించి పట్టించుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ గడిపేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలని నెరవేరే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, ఎర్రబెల్లి సతీష్ రావు, వేముల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు, బంగారం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ ఎంతో శక్తివంతమైన ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని, అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ రాఘవేంద్ర వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, కోశాధికారి సిహెచ్.రాజు, గౌరవాధ్యక్షులు ఐ. ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రాజు , ఆలయ కమిటీ చైర్మన్ టి. రాజేశ్వర్, కోశాధికారి డి. బాల్ రాజ్ , సంక్షేమ సంఘం , దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించు

**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



పీర్జాదిగూడ, (ప్రజాస్ఫూర్తి) : ఓ మహాత్మ కాంగ్రెస్ పార్టీకి,ప్రభుత్వానికి మంచి ఆలోచన ప్రసాదించి వారిచ్చిన 420 హామీలను వెంటనే నెరవేర్చే విధంగా బుద్ధి ప్రసాదించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నగర పరిధిలో గాంధీ విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి నేటికి 420 రోజులు అయిన సందర్భంగా ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారెంటీలు, 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, నిర్మల, ప్రభు, ఆంజనేయులు, బాలరాజు, యాసారం శ్రీనివాస్, కర్రే కుమార్, వెంకన్న, శంకర్, కిరణ్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులకు తప్పిన ప్రమాదం

- విశాఖ స్టీల్ ప్లాంట్ కు వెళుతున్న సమయంలో కాన్వాయ్ లో వాహనాలు ఢీ
- ధ్వంసమైన కారులో మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

**ఏపీ బ్యూరో :** విశాఖపట్నం పర్యటనలో కేంద్ర మంత్రుల కాన్వాయ్ కు ప్రమాదం జరిగింది. ఇందులో మంత్రులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ కాన్వాయ్‌లో తృటిలో ప్రమాదం తప్పింది. మొదట విశాఖ చేరుకున్న కేంద్ర ఉక్కు మంత్రులు కుమార స్వామి, శ్రీనివాస్ వర్మకు ఎయిర్‌పోర్ట్‌లో ఎంపీలు భరత్, అప్పల నాయుడు, బీజేపీ నేతలు.. ఘన స్వాగతం పలికారు. ఉక్కు పరిశ్రమకు రూ. 11,440 కోట్ల కేంద్ర ప్యాకేజీ ప్రకటించిన తర్వాత తొలిసారి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి రావడంతో వెల్‌కమ్ చెప్పారు. ఎయిర్‌పోర్ట్ నుంచి స్టీల్ ప్లాంట్‌కు వెళ్తున్న సమయంలో షీలా నగర్ వద్ద కాన్వాయ్‌లోని మూడు వాహనాలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయి.. ఎనిమిది వాహనాల కాన్వాయ్‌లో మూడు కార్లు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది.. ఈ ఘటనలో మూడు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి.. ధ్వంసమైన కారులో మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కారు కూడా ఉంది.

# పెట్టుబడులను ఎప్పటికప్పుడు సమీక్షించాలి

- వేగంగా తీసుకువచ్చేలా పని చేయాలి
- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం



**ఏపీ బ్యూరో :** ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే అవకాశాన్ని వేగంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) మూడో సమావేశం ప్రారంభం అయింది. ఇందులో 15 ప్రాజెక్టులకు సంబంధించి పెట్టుబడులకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకోనున్నారు. రూ.44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలపనున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. గత రెండు సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల స్థితిగతులపైనా ఇందులో చర్చించనున్నారు. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతర చర్చలు జరిపి సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, మంత్రులు పెట్టుబడులను ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరితగతిన ఫలితాలు చూపించాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో అనుమతులు, క్షేత్ర స్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష చేయాలని ప్రధాన కార్యదర్శికి తెలిపారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థల నుంచి, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందని అభిప్రాయపడ్డారు.

## ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం

- మొదటి దశలో 161 రకాల పౌర సేవలు
- ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- అధికారిక వాట్సాప్ నెంబర్ విడుదల
- 'మన మిత్ర' పేరుతో అధికారిక వాట్సాప్



**ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్టిఫికెట్ల జారీ కోసం వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రారంభించింది. దేశంలోనే తొలిసారిగా ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం పౌరసేవలు అందించేందుకు ఈ యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలకు మొదటి దశలో 161 రకాల పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయి. రెవెన్యూ, దేవాదాయ శాఖ, సీఎంఆర్ఎఫ్.. ఇలా మొత్తంగా "మన మిత్ర" ద్వారా 161 రకాల సేవలను పౌరులకు అందుబాటులో ఉంటాయని.. వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.. రెండో దశలో 300 పైగా పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయి.. ఇక ఏపీ ప్రభుత్వం దీనికోసం అధికారిక వాట్సప్ నంబర్ 95523 00009ను కేటాయించింది. దీని ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందించనుంది.. ఒకేముందు.. 95523 00009ను సేవ్ చేసుకోండి.. మీకు కావాల్సిన సేవను అందుకోండి.. ఇక, వాట్సాప్ సేవలను ప్రారంభించిన సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. పరిపాలన సంస్కరణల్లో ఇది ఒక చారిత్రాత్మక రోజు. "మన మిత్ర" పేరుతో దేశంలోనే మొదటి సారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభిస్తున్నాం. గతంలో చంద్రబాబు ఈ గవర్నన్స్‌తో ముందుకు వస్తే, ఈ సారి వాట్సాప్ గవర్నెన్స్ తో ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాం అన్నారు. యువగళం పాదయాత్రలో నే వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన వచ్చిందన్నారు.. బటన్ నొక్కితే భోజనం, సినిమా వచ్చినపుడు.. పాలన ఎందుకు రాకూడదు..? ప్రజల చేతిలో ప్రభుత్వం ఉండాలనేది మా ఉద్దేశం అన్నారు.. ఊరు నుంచి ఇంకో ఊరు పాదయాత్రలో వెళ్ళినప్పుడు సర్టిఫికెట్ ల కోసం మమ్మల్ని తిప్పద్దు అని చాలా మంది అడిగారు.. గత ఐదేళ్లలో సర్టిఫికెట్ కుడి కొన్ని సందర్భాల్లో రాలేదు. దుగ్గిరాల మండలంలో ఎంపీటీసీ పోటీ చేస్తే గత ప్రభుత్వం బీసీ సర్టిఫికెట్ ఇవ్వలేదు.. సర్టిఫికెట్ కోసం ఎవ్వరు ఇబ్బంది పడకూడదు అనేది మా ఉద్దేశమని స్పష్టం చేశారు.

## కుంభామేళాలో టీటీడీ ఉద్యోగి అదృశ్యం

**నేషనల్ బ్యూరో:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో టీటీడీ ఉద్యోగి అదృశ్యమయ్యారు. టీటీడీ ఆధ్వర్యంలో అక్కడ ఏర్పాటు చేసిన నమూనా ఆలయంలో విధులు నిర్వహించేందుకు వెళ్లిన దీవేటి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి బుధవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయారు. ఆయన ఆచూకీ కోసం స్థానిక పోలీసులు, టీటీడీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉద్యోగి అదృశ్యంపై పూర్తి సమాచారం అందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. శ్రీవారి నమూనా ఆలయంలో పనిచేసేందుకు సుమారు 200 మంది తితిదే ఉద్యోగుల వెళ్లారు. ఈ క్రమంలో ఓ ఉద్యోగి అదృశ్యమయ్యారు.

## అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్టు

- ప్రెస్ మీట్ మధ్యలో అరెస్టు చేసిన పోలీసులు
- పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని మహిళ ఫిర్యాదు
- ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరిన ఎంపీ
- బెయిల్ తిరస్కరించిన కోర్టు



**నేషనల్ బ్యూరో :** కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్ పై అత్యాచార ఆరోపణలతో యూపీ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపుర్ ఎంపీగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలపై కేసు నమోదు అయింది. దీంతో సీతాపుర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయన్ను అరెస్టు చేసినట్లు సమాచారం. భారీ పోలీసు భద్రత నడుమ ఆయన్ను కోర్టుకు తీసుకెళ్లారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్‌స్‌ను సైతం పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపీ రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా..న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించినట్లు సమాచారం. అంతకముందు ఇదే కేసులో ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివాసం వద్దకు భారీ బందోబస్తుతో వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అర్వింద్ కేజ్రీవాల్ కు ఎన్నికల సంఘం నోటీసులు

- రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తత వచ్చేలా కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- సరైన సమాధానం ఇవ్వాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- యమునా నదిలో హర్యానా విషాన్నికలుపుతోందని కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు



**నేషనల్ బ్యూరో :** యమునా నది జల కాలుష్యంపై తన ప్రకటనలకు సంబంధించి ఎన్నికల సంఘం నోటీసుకు ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఆ తర్వాత ఎన్నికల సంఘం మళ్లీ కేజ్రీవాల్‌పై స్పందించింది. కేజ్రీవాల్ ప్రకటనలు రెండు రాష్ట్రాల మధ్య యుద్ధం చేస్తున్నట్లుగా ఉన్నాయని ఎన్నికల సంఘం పేర్కొంది. యమునా నదిలో అమ్మోనియా పెరుగుదల అంశాన్ని సామూహిక మారణహోమం అనే తీవ్రమైన ఆరోపణతో కలపవద్దని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కోరినందుకు ఎన్నికల కమిషన్ స్పందించింది. ఇది రెండు రాష్ట్రాల మధ్య యుద్ధం ప్రారంభించే చర్యతో సమానమని పేర్కొంది. హర్యానా యమునా నదిలో విషం కలుపుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.

### ఎన్నికల కమిషన్ ఏం చెప్పింది?

రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, అశాంతిని ప్రోత్సహించడం వంటి తీవ్రమైన ఆరోపణలకు కేజ్రీవాల్‌పై ఎందుకు చర్య తీసుకోకూడదో వివరించడానికి ఎన్నికల సంఘం ఆయనకు మరో అవకాశం ఇచ్చింది. దీనితో పాటు శుక్రవారం ఉదయం 11 గంటల వరకు ఢిల్లీ జల్ బోర్డు ఉద్యోగులు "విషాన్ని" ఎలా గుర్తిస్తున్నారో చెప్పాలని ఎన్నికల కమిషనర్ కేజ్రీవాల్‌ను కోరారు. ఇంజనీర్లు ఎలా పని చేస్తున్నారనే దాని గురించి సమాచారాన్ని ఇవ్వాలని కూడా వారిని కోరారు. అలా చేయడంలో విఫలమైతే ఈ విషయాలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వలేకపోతే ఈ విషయంలో కమిషన్ తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు.

## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లు

- జనవరి 31 నుంచి పార్లమెంట్ సెషన్స్ ప్రారంభం
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిల పక్షం భేటీ



**నేషనల్ బ్యూరో :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానుండగా నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది. బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతో పాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించాయి

## మ
## సుప్రీంలో పిటిషన్

**నేషనల్ బ్యూరో :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విశాల్ తివారీ అనే న్యాయవాది ఈ వ్యాజ్యాన్ని వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అందులో కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు.

## ఏపీలో ఏడు నెలల్లోనే
# 1.19 లక్షల కోట్లు అప్పు

- అయినా ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదు
- సీఎం చంద్రబాబు ను నిలదీసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి మరిచిపోయారు
- జగన్ చెప్పిందే చేస్తాడు.. చేసేదే చెప్తాడని ప్రశంసలు



**ఏపీ బ్యూరో :** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లోనే రూ. 1.19 లక్షల కోట్ల అప్పులు తెచ్చి ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు ఇవ్వలేదని ఎమ్మెల్యే పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు పెద్ద గుండు సున్నా పెట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెల్లలో రూ. 1.19 లక్షల కోట్లు అప్పు తెచ్చారు. ఆ సొమ్మును ఏం చేశారో చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ అన్నారు. ఇప్పుడు సాధ్యం కాదు అంటున్నారు. ఇంతకు ముందు అంతర్జాతీయ ఆర్థికవేత్తలతో మాట్లాడి హామీ ఇచ్చాను అన్నారు. ఇప్పుడేమో సూపర్ సిక్స్ గురించి మాట్లాడటం లేదు. హామీ ఇచ్చే రోజు మీకు తెలియదా? వైఎస్ జగన్ చేసేది చెప్తారు చెప్పింది చేస్తారు.. చంద్రబాబు రాజకీయాల్లో కొనసాగేందుకు అనర్హులు. ఏడు నెలల్లోనే రూ.1.19 లక్షల కోట్లు అప్పు తెచ్చారు. ఆ సొమ్ము ఏ సంక్షేమానికి ఇచ్చారు..? దుర్మార్గంగా రాష్ట్ర ప్రజల్ని మోసం చేశారు. వైఎస్ జగన్ కోవిడ్ 19 సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. హామీ ఇచ్చిన తేదీ ప్రకారం సంక్షేమాన్ని అందించారు. ఆ సంక్షేమం గురించి తెలుసుకునేందుకు ఇతర రాష్ట్రాల నేతలు, అధికారులు ఏపీకి వచ్చారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రశంసలు కురిపించారు. నీ చంద్రబాబు అలా కాదు. సంక్షేమ పథకాలు అందించే అవకాశం ఉన్నా.. డబ్బులు లేవని దాట వేస్తున్నారు. అంటే చంద్రబాబుకు ప్రజలకు మంచి చేసే ఉద్దేశ్యం లేదు. అధికారంలోకి వచ్చారు. ఆరోగ్య శ్రీతో పాటు, రాష్ట్రంలోని వైద్య విద్యను నిర్వీర్యం చేశారు. మాట్లాడితే జగన్ విధ్వంసం చేశారని అంటున్నారు. పేదలను ఆదుకోవడం విధ్వంసమా.. అమరావతిలో రియల్ ఎస్టేట్ చేయడం విధ్వంసమా..?సూపర్ సిక్స్ లేదు. గుండు సున్నా చేశారు. ఆ రోజు ఈ రాష్ట్రం శ్రీలంక అయిపోతుంది అన్నారు. పవన్ కళ్యాణ్, పురంధేశ్వరి ఆనాడు చంద్రబాబుకి వంత పాడారు.

# ఢిల్లీ రంజీ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ

- అరుణ్ జైట్లీ మైదానంలో స్వల్ప తోపులాట
- విరాట్ ను చూసేందుకు ఎగబడ్డ జనం
- ముగ్గురికి గాయాలు
- 12 ఏండ్ల తర్వాత డొమెస్టిక్ క్రికెట్ ఆడుతున్న విరాట్ కోహ్లీ

**నేషనల్ బ్యూరో :** 12 ఏళ్ల తర్వాత భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్ లో మ్యాచ్ ఆడేందుకు బరిలోకి దిగాడు. రంజీ ట్రోఫీ చివరి రౌండ్‌లో ఢిల్లీ తరపున మ్యాచ్ లో పాల్గొన్నాడు. అరుణ్ జైట్లీ మైదానం వేదికగా రైల్వేస్‌తో దిల్లీ తలపడుతుండగా.. కోహ్లీని చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారు. దాదాపు 10 వేల మందికి పైగా ప్రేక్షకులు వస్తారని దిల్లీ క్రికెట్ సంఘం ముందే అంచనా వేసింది. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసింది. కానీ, అభిమానులు మాత్రం భారీగా వచ్చారు. దీంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. మైదానంలోని 16వ గేట్ వద్ద ఫ్యాన్స్ ఒకరినొకరు నెట్టుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొందరు కింద పడిపోయారు. పోలీస్ శాఖకు చెందిన ఓ బైక్ కూడా ధ్వంసమైంది. చాలామంది షూలు, చెప్పులను వదిలేసి మరీ వెళ్లడం గమనార్హం. ఓ ముగ్గురు గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. వారికి డీడీసీఏ సెక్యూరిటీ, పోలీసులు ప్రాథమిక చికిత్స అందించారు. ఓ భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దడంతో అంతా సద్దుమణిగింది.

**భారీగా వచ్చిన అభిమానులు**

అభిమానులు భారీగా వస్తారని ఢిల్లీ క్రికెట్ సంఘం అధికారులు ముందే చెప్పారు. అందుకోసం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కానీ, మైదానంలోకి పంపించేందుకు కేవలం మూడు గేట్లను మాత్రమే తెరిచి అందుబాటులో ఉంచటంపై విమర్శలు వస్తున్నాయి. మెట్రో స్టేషన్‌కు దగ్గరగా ఉండే గేట్ 16, గేట్ 17 వద్ద అభిమానులు ఉదయం నుంచే క్యూ కట్టారు. దాదాపు గంటపాటు వేచిఉన్నా గేట్లను తెరవలేదు. దీంతో కొందరు యువకులు ఆందోళనతో 16వ నెంబర్ గేట్‌ను ఓపెన్ చేయాలని నెట్టడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇతర గేట్ల నుంచి వెళ్లాలని సెక్యూరిటీ ఆఫీసర్ చెప్పినా ఎవరూ వినలేదు. చిన్నారులతో వచ్చిన కొందరు అభిమానులు వారిని తమ భుజాలపై కూర్చోబెట్టుకున్నారు. ఆ సమయంలో పలువురు గాయపడ్డారు. చివరికి సెక్యూరిటీ అధికారులు వచ్చి గేట్‌ను ఓపెన్ చేసి నెమ్మదిగా పంపించారు. మ్యాచ్‌ను చూసేందుకు



వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తీసుకురావాలని డీడీసీఏ అభిమానులకు సూచించింది. కానీ, ఫ్యాన్స్ ఎక్కువగా ఉండటంతో వాటిని చెక్ చేయకుండానే లోపలికి అనుమతించారు.

**టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ**

రైల్వేస్‌తో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఢిల్లీ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తమ అభిమాన క్రికెటర్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌ను చూడాలని వచ్చిన అభిమానులకు కాస్త నిరాశే ఎదురైంది. అయితే, కోహ్లీ మాత్రం సహచర క్రికెటర్లను ఉత్సాహపరుస్తూ మైదానంలో చురుగ్గా ఉన్నాడు. వికెట్లు తీసిన బౌలర్లను అభినందిస్తూ స్ఫూర్తి నింపాడు. ఈక్రమంలో ఓ అభిమాని మైదానంలోకి దూసుకొచ్చి విరాట్ కోహ్లీ కాళ్లకు నమస్కరించాడు. అతడిని పైకి లేపిన కోహ్లీ అలాంటివి చేయద్దంటూ సూచించాడు. ఆ వెంటనే సెక్యూరిటీ సిబ్బంది ఆ ఫ్యాన్‌ను బయటకు తీసుకెళ్లారు. ప్రస్తుతం రైల్వేస్ స్కోరు 20 ఓవర్లకు ఐదు వికెట్లను కోల్పోయి 66 పరుగులు చేసింది.

## నో వెహికల్ జోన్ గా ప్రయాగ్ రాజ్

### మహా కుంభ్ లో వీవీఐపీ పాసుల రద్దు

**నేషనల్ బ్యూరో :** మహాకుంభ మేళాలో వీవీఐపీ పాసులను రద్దు చేశారు. ప్రయాగ్‌రాజ్ ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. మంగళవారం త్రివేణి సంగం ఘాట్ వద్ద జరిగిన తొక్కిసలాటలో 30 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూపీ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకున్నది. అమృత స్నానం కోసం ఎగబడ్డ జనం బారికేడ్లను నెట్టివేసిన సమయంలో తొక్కిసలాట జరిగినట్లు డీఐజీ తెలిపారు. మహాకుంభ్ ప్రాంతంలోకి వాహనాల ఎంట్రీని నిషేదించారు. వీవీఐపీ పాసులను రద్దు చేశారు. వెహికిల్ ఎంట్రీ కోసం ఇచ్చే ప్రత్యేక పాసులకు కూడా అనుమతి లేదు. అన్ని మినహాయింపుల్ని రద్దు చేశారు. వన్‌వే రూట్లను అమలు చేస్తున్నారు. భక్తులు సలువుగా నడిచేందుకు వన్‌వే ట్రాఫిక్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. ప్రయాగ్‌రాజ్ సమీప జిల్లాల నుంచి వస్తున్న వాహనాలను ఆ జిల్లా సరిహద్దులకే పరిమితం చేయనున్నారు.

### మూడో సెషన్‌లో లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

## మూడుశాతం పెరిగిన సిప్లా..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్‌లో మిశ్రమ సంకేతాలతో పాటు వడ్డీ రేట్లపై యూఎస్ రిజర్వ్ యథాతథంగా కొనసాగించిన నేపథ్యంలో మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. ఉదయం లాభాలతో మొదలైన మార్కెట్లు పొద్దంతా లాభాల్లోనే కొనసాగాయి. మూడో సెషన్‌లో సూచీలు స్వల్పంగా పతనం కాగా.. చివరి అరగంటలో మళ్లీ కోలుకొని లాభాల్లో ముగిశాయి. గురువారం ఉదయం సెన్సెక్స్ 76,598.84 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,401.13 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 76,962.88 పాయింట్లు వరకు చేరింది. చివరకు 226.85 పెరిగి.. 76,759.81 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 86.40 పాయింట్లు పెరిగి 23,249.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,051 షేర్లు లాభాను నమోదు చేశాయి.

మరో 1,734 షేర్లు నష్టపోగా.. 117 షేర్లు మారలేదు. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, సిప్లా, పవర్ గ్రిడ్ కార్ప్ లాభాలను ఆర్జించాయి. టాటా మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఆటో, ఐటీ, మీడియా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.4-2 శాతం మధ్య పతనం కాగా.. చమురు, గ్యాస్, పవర్, ఫార్మా, పీఎస్‌యూ, ఎఫ్ఎంసీజీ, రియాల్టీ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు మధ్య పెరిగాయి. ఎన్ఎస్ఈలో ఫార్మాస్యూటికల్ దిగ్గజం సిప్లా మూడుశాతం లాభపడగా.. పవర్ గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా రెండూ 2.76 శాతం వృద్ధి చెందాయి. బజాజ్ ఫైనాన్స్ 2.67 శాతం లాభపడింది. చమురు దిగ్గజం ఓఎన్‌జీసీ 2.45శాతం పెరిగింది.

### నిర్మలమ్మ బడ్జెట్‌లో కీలకంగా

## వ్యవహరించేది ఈ ఐదుగురే..!



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలో జనవరి 31న మొదలు కానున్నాయి. ఇక ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ని పార్లమెంట్‌కు సమర్పిస్తారు. బడ్జెట్‌పై అందరి దృష్టి నెలకొన్నది. చిరు వ్యాపారుల నుంచి బడా పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులతోపాటు మధ్య తరగతి ప్రజలు సైతం బడ్జెట్‌పై భారీగానే ఆశలు పెట్టుకున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తుంది. గత పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత గతేడాది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ని మాత్రమే ప్రవేశపెట్టారు. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ని నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కి బడ్జెట్ సమర్పిస్తారు. అయితే, బడ్జెట్ ఎవరు తయారు చేస్తారనే విషయం చాలా మందికి తెలియదు. బడ్జెట్‌లో ఐదుగురు అధికారులు కీలకంగా వ్యవహరిస్తారు.

#### తుహిన్ కాంత్ పాండే

తుహిన్ కాంత్ పాండే 1987 బ్యాచ్‌కు చెందిన ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి. ఆయన 2019 అక్టోబర్ 24 నుంచి ఐదేళ్ల పాటు కేంద్ర పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం కార్యదర్శిగా పని చేశారు. 2024 సెప్టెంబర్‌లో కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ ఏడాది జనవరి 9న కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన పన్ను రాయితీలను బ్యాలెన్స్ చేస్తూ దేశ ఆదాయాలు తగ్గకుండా చూస్తారు. పన్ను వ్యవస్థను సరళీకృతం చేస్తూ.. దేశ రెవెన్యూను పెంచే దిశగా తుహిన్ కాంతపాండే బడ్జెట్ కోసం తన ప్రణాళికలను అందించారు. ఆయన ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం కార్యదర్శిగా ఉన్న సమయంలోనే ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ జరిగింది. ఎల్ఐసీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యింది.

#### అజేయ్ సేథ్

అజేయ్ సేథ్ 1987 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాగా.. 2021 ఏప్రిల్ నుంచి కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం (%ణజూా%) కార్యదర్శిగా పని చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను చివరగా ఫైనల్ చేసేది డీఈఏ విభాగమే. భారత ఆర్థిక వృద్ధిని, ఆర్థిక వనరులను జాగ్రత్తగా నిర్వహించడం, వ్యయాల నియంత్రణ తదితర నిర్ణయాలను ఈ విభాగం చూసుకుంటుంది. డీఈఏ కార్యదర్శిగా బడ్జెట్ తయారీ ప్రక్రియ, అన్ని మంత్రిత్వ శాఖల సమన్వయం, విధాన రూపకల్పన అంశాలను పర్యవేక్షిస్తారు. ఇక అజయ్ సేత్ భారత దేశ తొలి సావరిన్ గ్రీన్ బాండ్ జారీ ప్రకియలో కీలక భూమిక పోషించారు.

#### మనోజ్ గోవిల్

మనోజ్ గోవిల్ 1991 బ్యాచ్ మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ విభాగం కార్యదర్శిగా విధులు నిర్వరిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలు, కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణ తదితర బాధ్యతలను చూస్తారు. ప్రభుత్వ వ్యయాలు సద్వినియోగం అయ్యేలా ప్రణాళికలను సిద్ధం చేయడం ఆయన బృందం చూసుకుంటుంది. గోవిల్ గతంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖలో సేవలందించారు. ఐఐటీ కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్ డిగ్రీ చేశారు. ప్రిన్స్ టన్ యూనివర్సిటీలో పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ, ఎకానమిక్స్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

#### వీ అనంత్ నాగేశ్వరన్

వీ అనంత్ నాగేశ్వరన్ భారత ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సలహాదారు. ఆయన ఆసియా పరిశోధనా అధిపతిగా.. ఆ తర్వాత స్విట్జర్లాండ్‌లోని బ్యాంక్ జూలియస్ బేర్‌లో గ్లోబల్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేశారు. స్విట్జర్లాండ్, సింగపూర్‌లో క్రెడిట్ సూయిస్సే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ (%ఖదీూ%) కోసం పనిచేశారు. ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్‌గా, సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ విద్యార్థుల ప్రొఫెసర్‌గా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇండోర్‌లో సేవలందించారు. ఈయన సారథ్యంలో ఆర్థిక సర్వే తయారు చేస్తారు. అనంత్ గతంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో తాత్కాలిక సభ్యుడిగా సేవలు అందించారు.

#### అరుణిష్ చావ్లా

అరుణిష్ చావ్లా 1992 బ్యాచ్ బిహార్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్మెంట్ పెట్టుబడులు, పబ్లిక్ అసెట్ మేనేజ్మెంట్ విభాగానికి అధిపతిగా నియామకమయ్యారు. ఆర్థిక మంత్రి టీమ్‌లో ఆయన కొత్తగా చేరారు. ఐడీబీఐ బ్యాంక్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల వద్ద పడి ఉన్న ఆస్తుల నుంచి నిధుల సమీకరణకు ఆయన ప్రణాళికలు తయారు చేస్తారు. ఆయన ఇంతకు ముందు రెవెన్యూ కార్యదర్శిగానూ సేవలందించారు. ప్రస్తుతం పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

#### వివేక్ నాగరాజు

వివేక్ నాగరాజు కేంద్ర ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగానికి కార్యదర్శిగా పని చేస్తున్నారు. గతేడాది ఆగస్టు 19 నుంచి ఈ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రుణాల మంజూరు, డిపాజిట్ల మొబిలైజేషన్, ఫిన్టెక్లను నియంత్రించడం, బీమా కవరేజీలను పెంచడం, డిజిటల్ ఇన్‌ఫ్రాను మెరుగుపరచడం తదితర కార్యకలాపాలను చూస్తారు. ఆయన 1993 బ్యాచ్ త్రిపుర కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. అమెరికాలోని వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సలహాదారుగా పని చేశారు.

### రోహిత్ లాహోర్‌కు వెళ్లేది

# అనుమానమే?



#### ఫిబ్రవరి 16న చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలు..!

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ వేదికగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరుగనున్నది. ఫిబ్రవరి 19 నుంచి టోర్నీ జరుగనున్నది. అంతకు ముందు 16న లాహోర్‌లో చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవం జరుగనున్నది. అయితే, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రారంభోత్సవానికి హాజరవుతాడా? లేదా తెలియాల్సి ఉంది. సమాచారం మేరకు.. బీసీసీఐ రోహిత్‌ను లాహోర్‌కు పంపేందుకు అవకాశం లేదని తెలుస్తుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రెస్ కాన్ఫరెన్స్, ఫొటోషూట్ కోసమైనా లాహోర్‌కు వస్తారా ? లేదా అన్న విషయంలో ఐసీసీ, పీసీబీ స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయంలో బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఆసక్తికరంగా మారింది.

#### ఏం చెప్పని ఐసీసీ

ఫిబ్రవరి 19న కరాచీలోని నేషనల్ స్టేడియంలో పాకిస్థాన్ న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ ముందు షెడ్యూల్ చేసిన కార్యక్రమాల జాబితాకు చైర్మన్ మోహ్సిన్ నఖ్వీ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 7న గడాఫీ స్టేడియాన్ని పీసీబీ పునః ప్రారంభించనున్నది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్‌ను, 11న కరాచీలో నేషనల్ స్టేడియం పునః ప్రారంభోత్సవానికి అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని అతిథిగా ఆహ్వానించారు. ఫిబ్రవరి 16న లాహోర్‌లో జరిగే కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్, ఫొటోషూట్ కోసం పీసీబీ, ఐసీసీ షెడ్యూల్‌ను రూపొందించినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రారంభోత్సవ కార్యక్రమం చారిత్రాత్మక లాహోర్ కోటలోని హుజురి బాగ్‌లో జరుగుతుంది. బోర్డుల అధికారులు, ప్రముఖులు, క్రీడా దిగ్గజాలు, ప్రభుత్వ అధికారులను ఆహ్వానించనున్నారు.

#### టీమిండియా షెడ్యూల్ ఇలా..

ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో భారత్ తన మొదటి లీగ్ దశ మ్యాచ్ ఆడనుంది. ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడుతుంది. ఆ తర్వాత టీమిండియా జట్టు వారం పాటు విరాం దొరుకుతుంది. మార్చి 2న న్యూజిలాండ్‌తో మ్యాచ్ ఆడుతుంది. భారత జట్టు చివరిసారిగా 2013లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని గెలిచింది. అప్పుడు మహేంద్ర సింగ్ ధోనీ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నారు. 2002లో వర్షం కారణంగా ఫైనల్ రద్దయ్యింది. ఆ సమయంలో భారత్, శ్రీలంక జట్లను సంయుక్తంగా విజేతలుగా నిలిచాయి. భారత జట్టు మొత్తం నాలుగు సార్లు ఫైనల్‌కు చేరింది. 2000, 2017లో టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరింది.

#### ఎనిమిది జట్లు బరిలో..

ఛాంపియన్స్ ట్రోఫీలో ఎనిమిది జట్లు పాల్గొనుండగా.. మొత్తం 15 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈసారి మ్యాచులను పాకిస్తాన్, దుబాయి ఆతిథ్యం ఇస్తాయి. భారత జట్టు అన్ని గ్రూప్ దశ మ్యాచులు దుబాయిలోనే జరుగుతాయి. అయితే, మిగిలిన జట్ల మ్యాచ్‌లు పాకిస్తాన్‌లో మాత్రమే జరుగుతాయి. ఈ టోర్నమెంట్ 19 రోజుల పాటు కొనసాగుతుంది. పాకిస్థాన్‌లోని రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాల్లో మ్యాచ్‌లను నిర్వహిస్తాయి. పాకిస్తాన్‌లోని ప్రతి మైదానంలో మూడు గ్రూప్ మ్యాచులు జరుగుతాయి. భారత్‌లోనే పాల్గొనే మూడు గ్రూప్ మ్యాచ్‌లు, మొదటి సెమీ ఫైనల్ దుబాయిలో జరుగుతాయి.

#### మూడు నాకౌట్ మ్యాచులకు రిజర్వ్ డే

చాంపియన్స్ ట్రోఫీలో మూడు నాకౌట్ మ్యాచులకు రిజర్వ్ డే ఉంటుంది. సెమీ ఫైనల్స్, ఫైనల్‌కు రెండింటికీ రిజర్వ్ డే ఉంటుంది. దుబాయిలో మొదటి సెమీ ఫైనల్, లాహోర్‌లో రెండో సెమీ ఫైనల్ జరుగుతుంది. భారత్ ఫైనల్‌కు అర్హత సాధించకపోతే మార్చి 9న జరిగే ఫైనల్‌కు సైతం లాహోర్ ఆతిథ్యం ఇస్తుంది. భారత్ అర్హత సాధిస్తే మాత్రం దుబాయి వేదికగా జరుగుతుంది. ఇది పాకిస్థాన్‌కు ఇబ్బందికరమే.

## ఉస్మాన్ ఖవాజా డబుల్ సెంచరీ



**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న ఫస్ట్ టెస్ట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా డబుల్ సెంచరీ చేశాడు. అతను 232 రన్స్ చేసి ఔటయ్యాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న ఆస్ట్రేలియా తాజా సమాచారం ప్రకారం 143 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 600 రన్స్ చేసింది. శ్రీలంకలో సచిన్ చేసిన డబుల్ సెంచరీ రికార్డును ఖవాజా బ్రేక్ చేశాడు. 2010లో సచిన్ 37 ఏళ్ల వయసులో డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఆ మ్యాచ్లో అతను 347 బంతుల్లో 203 రన్స్ చేశాడు. అయితే ఖవాజా 38 ఏళ్ల వయసులో డబుల్ సెంచరీ చేయడం విశేషం. 15 ఏళ్ల క్రితం సచిన్ నమోదు చేసిన ఓల్డెస్ట్ ప్లేయర్ రికార్డును ఖవాజా బ్రేక్ చేశాడు. శ్రీలంకలో డబుల్ సెంచరీ స్కోర్ చేసిన తొలి ఆసీస్ బ్యాటర్‌గా కూడా ఖవాజా నిలిచాడు. టెస్టుల్లో ఆస్ట్రేలియా తరపున మైఖేల్ స్లేటర్ అత్యధికంగా 219 రన్స్ చేయగా, ఇప్పుడు ఆ రికార్డును ఖవాజా దాటేశాడు.

### మేఘాలయాతో రంజీ మ్యాచ్..

## శార్దూల్ ఠాకూర్ హ్యాట్రిక్



**ముంబై:** ముంబై బౌలర్ శార్దూల్ ఠాకూర్ హ్యాట్రిక్ తీశాడు. మేఘాలయాతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో అతను ఈ ఘనత సాధించాడు. ముంబైలోని శరద్ పవర్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఫస్ట్ మేఘాలయా బ్యాటింగ్ చేసింది. ఇన్నింగ్స్ మూడవ ఓవర్‌లో.. అతను వరుసగా అనిరుధ్ బీ, సుమిత్ కుమార్, జస్‌కీరత్‌లను ఔట్ చేశాడు. ఆ మ్యాచ్ ఫస్ట్ ఓవర్ నాలుగో బంతికే నిషాంత్ చక్రవర్తిని కూడా అతను ఔట్ చేశాడు. ఈ ఏడాది రంజీ సీజన్‌లో హ్యాట్రిక్ తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు శార్దూల్ ఠాకూర్. పాండిచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్ బౌలర్ రిషి ధావన్ హ్యాట్రిక్ తీశాడు. రంజీ ట్రోఫీ మ్యాచుల్లో హ్యాట్రిక్ తీసిన అయిదో ముంబై బౌలర్‌గా నిలిచాడు. ముంబై తరపున హ్యాట్రిక్ తీసినవారిలో రోస్టన్ హరాల్డ్ దయాస్, అబ్దుల్ మూసాబాయ్ ఇస్మాయిల్, ఉమేశ్ నారాయణ్ కులకర్ణి, జహంగీర్ బేరామ్‌జీ కోట్ ఉన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు శార్దూల్ ఠాకూర్ 20 వికెట్లు తీసి 297 రన్స్ చేశాడు. దీంట్లో రెండు అర్ధశతకాలు, ఓ శతకం ఉన్నది. తాజా సమాచారం ప్రకారం మేఘాలయా 13 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 37 రన్స్ చేసింది.

# యువ భారత్ జోరు సాగని..!

#### నేడు ఇంగ్లాండ్‌ను ఢీకొట్టనున్న టీమిండియా..!



**మలేషియా:** మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌లో భాగంగా టీమిండియా ఇంగ్లాండ్‌తో జనవరి 31న తలపడనున్నది. ఐసీసీ టోర్నీలో ఇప్పటి వరకు టీమిండియా వరుస విజయాలతో సెమీ ఫైనల్ వరకు చేరింది. ఇక కీలకమైన సెమీస్‌లోనూ నిక్కీ ప్రసాద్ నేతృత్వంలోని యువ భారత్ జోరును కొనసాగిస్తే ఫైనల్‌కు చేరుకోనున్నది. గ్రూప్ దశలో వెస్టిండీస్, మలేషియా, శ్రీలంకపై వరుస విజయాలను నమోదు చేసి సూపర్ సిక్స్‌కు చేరింది. సూపర్ సిక్స్ దశలో తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టుపై 150 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది.

#### త్రిష జోరు కొనసాగాలని..

సూపర్ సిక్స్ దశలో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి త్రిష గొంగడి అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది. అండర్-19 టీ20 వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారిగా సెంచరీ చేసిన బ్యాటర్‌గా చరిత్ర లిఖించింది. స్కాట్లాండ్ జట్టుపై 59 బంతుల్లోనే 10 పరుగులు చేసింది. ఇందులో 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో కేవలం 53 బంతుల్లోనే అజేయ సెంచరీ చేసింది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో మరో ఓపెనర్ జీ కమలినీ సైతం 42 బంతుల్లో 51 పరుగులతో రాణించింది. టోర్నీలోని ఐదు మ్యాచుల్లో త్రిష 76.66 సగటుతో 230 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బ్యాట్స్‌వుమెన్స్ దేవినా పెర్రిన్ 131 పరుగులతో రెండో స్థానంలో ఉంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో భారత్ బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి 58 పరుగులకే ఆలౌట్ చేశారు. ఈ మ్యాచ్‌లు ఆయుషి శుక్లా ఎనిమిది పరుగులు ఇచ్చి నాలుగు వికెట్ల పడగొట్టింది. వైష్ణవి శర్మ ఐదు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు, గొంగడి త్రిష ఆరు పరుగులు ఇచ్చి మూడు వికెట్ల చేసింది. వైష్ణవి ఇప్పటి వరకు 12 వికెట్ల పడగొట్టగా.. ఆయుషి పది వికెట్ల తీసింది.

**భారత జట్టు :** నిక్కీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చల్కే, జీ త్రిష, జీ కమలిని, భావికా అహిరే, ఈశ్వరి అవసరే, మిథిలా వినోద్, జోషితా వీజే, సోనమ్ యాదవ్, పరుణికా సిసోడియా, కేసరి ధృతి, ఆయుషి శుక్లా, ఆనందిత కిషోర్, వైష్ణన్, ఎండీ షబ్నం.

**ఇంగ్లాండ్ జట్టు:** అబి నార్గ్రోవ్ నార్గ్రోవ్ (కెప్టెన్), ఫోబ్ బ్రెట్, ఒలివియా బ్రిస్టెన్, టిల్లీ కోర్టీన్ కోల్‌మన్, ట్రూడీ జాన్సన్, కేటీ జోన్స్, షార్లెట్ లాంబార్ట్, ఈవ్ ఓనీల్, దేవినా పెర్రిన్, జెమిమా స్పెన్స్, షార్లెట్ స్టబ్స్, అమృతా సురేన్‌కుమార్, ప్రిషా థానవాలా, ఎరిన్ థామస్, గ్రా థానవాలా.



## జీవితంలో వారిని ఎప్పటికీ వదులుకోను : సమంత

టాకీస్: స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తిరిగి సినిమాల్లో బిజీ అవ్వాలని చూస్తుంది. మాయోసైటిస్ కారణంగా ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉంటున్న సామ్ ఇప్పుడు వరుసగా సినిమాలు కమిట్ అవుతుంది. సమంతకు తెలుగు, తమిళ్‌లో చాలా మంది అభిమానులు ఉన్నారు. ఈ ముద్దుగుమ్మ చివరిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఖుషి సినిమాలో నటించింది.ఈ చిత్రంలో నటుడు విజయ్ దేవరకొండకు జోడీగా నటించింది ఈ అమ్మడు.. ఈ చిత్రం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ వంటి భాషల్లో కూడా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా తర్వాత నటి సమంత అనారోగ్య సమస్యలతో సినిమాల్లో సినిమాలకు దూరం అయ్యింది. ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ తీసుకుంది.ఇక బ్రేక్ తీసుకున్న తర్వాత సోషల్ మీడియాతోనే ఎక్కువ సమయం గడుపుతుంది ఈ చిన్నది. రకరకాల ఫోటోలు, వీడియోలతో పాటు మోటివేషనల్ కొటేషన్స్ కూడా షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. ఇక ఇప్పుడు సామ్ తిరిగి సినిమాలతో బిజీగా మారనుంది. ఇటీవలే రెండు మూడు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇదిలా ఉంటే సమంత సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు , మోటివేషనల్ కొటేషన్స్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. కాగా సమంత రీసెంట్‌గా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. చిన్మయి భర్త రాహుల్ రవీంద్రన్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపింది. మయోసైటిస్ కోసం చికిత్స తీసుకుంటున్న సమయంలో ప్రతిరోజు అతను తన దగ్గరకు వచ్చిన ఎంతో ధైర్యం చెప్పేవాడని, కొంత సమయం నాతో గడిపి జోక్స్ వేస్తూ తనను నవ్వించేవాడని, చిన్మయి కూడా తనకు బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపింది. జీవితంలో వారిని ఎప్పటికీ వదులుకోను అని సామ్ చెప్పుకొచ్చింది.



## సాయిపల్లవి పారితోషికం పెంచిందా..?

**టాకీస్:** దక్షిణాదిలో సాయిపల్లవికి అగ్ర హీరోలతో సమానమైన ఇమేజ్ ఉంది. అభిమానగణం కూడా ఎక్కువే. గత ఏడాది 'అమరన్' సినిమాలో సాయిపల్లవి నటనకు సర్వత్రా ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రం మూడొందల కోట్లకుపైగా వసూళ్లను సాధించి ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తన పారితోషికాన్ని భారీగా పెంచిందని తమిళ మీడియాలో వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ భామ తెలుగులో 'తండేల్'తో పాటు బాలీవుడ్‌లో రెండు చిత్రాల్లో నటిస్తున్నది. 'అమరన్' చిత్రానికి మూడుకోట్ల పారితోషికం అందుకున్న ఆమె.. 'తండేల్'కు ఐదు కోట్లు స్వీకరించిందని ప్రచారం జరుగుతున్నది. ఈ వార్తల్లో నిజానిజాలు ఎలా ఉన్నా సాయిపల్లవి గురించి బాగా తెలిసిన వారు మాత్రం ఆమెకు రెమ్యునరేషన్ పట్టింపులు అస్సలు ఉండవని చెబుతారు. సినిమాల విషయంలో మంచి కథలు, పాత్రలకే అధిక ప్రాధాన్యం ఇస్తుందని, పారితోషికం విషయంలో డిమాండ్ చేసిన సందర్భాలు లేవన్నది ఇండస్ట్రీ మాట. 'పడి పడి లేచె మనసు' సినిమా ఫెయిల్యూర్ కావడంతో ఆమె తన పారితోషికాన్ని కూడా వదులుకుందని అంటారు. సాయిపల్లవి నాగచైతన్యతో కలిసి నటించిన 'తండేల్' ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది.

## నాన్న పెట్టిన నిబంధనల మేరకే సినిమాలు చేస్తున్నా : అదితి శంకర్

టాకీస్: తన తండ్రి ఎస్. శంకర్ పేరు, ఇమేజ్‌ను ఉపయోగించుకుని సినిమా అవకాశాలు అడగడం లేదని హీరోయిన్ అదితి శంకర్ స్పష్టం చేశారు. డాక్టర్ కోర్సు పూర్తి చేసిన అదితి.. సినిమాలపై ఉన్న ఆసక్తితో హీరోయిన్‌గా అరంగేట్రం చేశారు. కార్తీ హీరోగా వచ్చిన 'విరుమన్' సినిమాలో తొలిసారి నటించారు. ఆ తర్వాత 'మావీరన్', 'నేసిప్పాయ' సినిమాల్లో నటించగా ప్రస్తుతం 'వన్స్‌మోర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చిన 'నేసిప్పాయ' చిత్రం పాజిటివ్ టాక్‌తో మంచి సక్సెస్‌ను అందుకుంది. ఇప్పుడీ చిత్రం తెలుగులో 'ప్రేమిస్తావా' అనే టైటిల్‌తో విడుదలకాబోతోంది. ఈ నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సంచలన కామెంట్స్ చేశారు. "శంకర్ కుమార్తె కావడం గర్వంగానే ఉంది. కానీ, ఆయన పేరు చెప్పి సినిమా అవకాశాలు కోరడం ఇష్టంలేదు. అవకాశం వచ్చిన ప్రతి అడిషన్‌కు వెళ్తున్నాను. సినిమాల్లో సక్సెస్, ఫెయిల్యూర్ మన చేతుల్లో లేదు. వైద్య కోర్సు పూర్తి చేసిన వెంటనే సినిమాల్లోకి వెళతానని డాడీకి చెప్పాను. ఆయన సుధీర్ఘంగా ఆలోచన చేసి నిర్ణీత గడువులోగా సక్సెస్ కాకపోతే తిరిగి వైద్య వృత్తికి అంకితం కావాలని కండిషన్ పెట్టారు. ఆ నిబంధనకు అంగీకరించి ఇపుడు సినిమాల్లో నటిస్తున్నాను. డబ్బుకోసం సినిమాల్లో యాక్ట్ చేయడం లేదు. హిస్టరీ, పురాణకథల్లో నటించాలన్న కోరికవుంది. తెలుగులో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌లో హీరోగా చేస్తున్న చిత్రంలో నటిస్తున్నాను. తమిళంలో రజనీకాంత్, నిత్యా మేనన్, సాయి పల్లవి అంటే ఇష్టం. నా తండ్రి దర్శకత్వంలో నటించాలన్న కోరిక ఉంది. ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను" అని అదితి శంకర్ చెప్పుకొచ్చారు. తాజాగా టాలీవుడ్‌లో జరిగిన 'ప్రేమిస్తావా' ట్రైలర్ లాంచ్ వేడుకలో మాట్లాడుతూ.. 'ప్రేమిస్తావా' సినిమాను తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది నా ఫస్ట్ లవ్ స్టోరీ.. ఇందులో లవ్ ఉంది.. యాక్షన్ ఉంది.. రొమాన్స్ ఉంది. డైరెక్టర్ విష్ణు వర్ధన్ స్టైలిష్ మేకింగ్ ఉంది.



## బాయ్స్ తరువాత మళ్లీ యాక్టర్‌గా థమన్

**టాకీస్:** కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన బాయ్స్ సినిమాతో యాక్టర్‌గా తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్. సిద్దార్థ్, జెనీలియా కాంబోలో వచ్చిన ఈ చిత్రంలో మ్యూజిక్ బ్యాండ్ టీంలో ఒకడిగా నటించాడు థమన్. అయితే ఆ తర్వాత కంపోజర్‌గా మాత్రమే సక్సెస్‌ఫుల్‌గా ప్రయాణాన్ని సాగిస్తున్నాడు. ప్రస్తుతం ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాప్ కంపోజర్లలో ఒకడిగా నిలిచానడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ స్టార్ కంపోజర్ మళ్లీ నటుడిగా మారబోతున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం అధర్వ వన్ ఆఫ్ ది కీ రోల్‌లో నటిస్తోన్న ఓ తమిళ చిత్రంలో ఎస్ థమన్ లీడ్



యాక్టర్‌గా కనిపించబోతున్నాడట. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందని కోలీవుడ్ సర్కిల్‌లో కథనాలు హల్ చల్ చేస్తున్నాయి. మరి ఇదే నిజమైతే థమన్ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడనేది అంతటా ఆసక్తికరంగా మారింది. ఇటీవలే గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాలకు మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు థమన్. ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో టాక్ తెచ్చుకోలేకపోయినా మ్యూజిక్ పరంగా మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ప్రభాస్‌తో రాజాసాబ్, పవన్ కల్యాణ్‌తో ఓజీ సినిమాలు చేస్తున్నాడు థమన్. అఖండ 2 కూడా లైన్‌లో ఉంది.

## ఆకట్టుకుంటున్న పరదా ఫస్ట్‌లుక్



**టాకీస్:** అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పరదా'. మలయాళ నటి దర్శన, సంగీత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా బండి ఫేం ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్న ఈ మూవీ ఫస్ట్ లుక్‌తోపాటు టీజర్‌ను కూడా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. కాగా ఈ సినిమా మలయాళ వెర్షన్‌కు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ మూవీ మలయాళ థియాట్రికల్ హక్కులను పాపులర్ మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నాడు. హెూంబ్యానర్ వేఫరెర్ ఫిలిమ్స్‌లో పరదా చిత్రాన్ని విడుదల చేయనున్నారు. మిస్టికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రం సంప్రదాయపు కట్టుబాట్లు మహిళలను ఎలా అణచివేస్తున్నాయి. ఎలా ఎదగకుండా అణగదొక్కుతున్నాయి.. వాటిని దాటి మహిళలు ఎలా ఎదుగుతున్నారు అనే కాన్సెప్ట్ తో రాబోతున్నట్లు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.